
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 15 ఏప్రిల్ 2024




నాడు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో ఒంటిమిట్ట చెరువు కళకళ


నేడు నిర్వహణ ఖర్చులు లేక పథకం ఎత్తిపోయి చుక్కనీరు లేక చెరువు వెలవెల

దాశరథి.. అభివృద్ధి జాడేది..?

- రూ.100 కోట్ల అభివృద్ధి ప్రణాళికపై శీతకన్ను
- టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి
- జగన్ ప్రభుత్వంలో ఒక్క పనీ చేయలేదు
- ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం
- కలగా మారిన ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి
- 50 శాతం మాత్రమే పూర్తయిన కల్యాణ మండపం

రాజంపేట, ఏప్రిల్ 14 : ఆంధ్రా భద్రాద్రిగా ఒంటిమిట్ట కోదండ రామాలయ అభివృద్ధి పనులకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా ఆ పనుల్లో 50 శాతం పూర్తయినా మిగిలిన పనులు పూర్తి చేయడంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బ్రహ్మోత్సవాల నిర్వహణ తప్ప ఈ ఆలయ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. జగన్ ప్రభుత్వంలో రెండేళ్లు కరోనా వల్ల నామమాత్రంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎప్పటికప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలు తప్ప ఈ ఆలయంపై జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి జగన్ ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. తెలంగాణా విడిపోయిన తరువాత భద్రాచలం రీతిలో ఎంతో ఆధ్యాత్మిక, చారిత్రక నేపథ్యం ఉన్న కోదండరామాలయాన్ని ఆంధ్ర భద్రాద్రిగా ప్రకటించారు. ప్రకటించిన తరువాత ఒక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వమే కల్యాణోత్సవ ఏర్పాట్లు చేసింది. అనంతరం ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానానికి అప్పజెప్పారు. ఆ సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి 100 కోట్ల రూపాయల నిధులను ఆలయ అభివృద్ధికి కేటాయించి భద్రాచలం కంటే ఉన్నత స్థాయిలో ఈ కోదండరామాలయాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఆ సమయంలో నిత్యం కరవుతో ఇబ్బందులు పడుతూ తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న ఒంటిమిట్ట ప్రాంతంలో అటు భూగర్భజలాలు, ఇటు సాగు జలాలు ఏర్పాటు చేయడానికి కోదండరామాలయాన్ని ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువును ఎప్పుడూ నీటితో నింపి హైదరాబాదు ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేసి టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే సోమశిల వెనుక జలాల నుంచి కేవలం ఆరు నెలల వ్యవధిలో సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకపు ట్యాంకులను, మోటార్లను ఏర్పాటు చేశారు. శ్రీరామ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేసి ఒంటిమిట్ట చెరువుకు తెలుగుదేశం ప్రభుత్వం నీరందించింది. సుమారు 50 కోట్లతో ఆలయం వద్ద అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించారు. సుమారు లక్ష మంది వీక్షించే విధంగా కల్యాణ మండపం ఏర్పాటు, మాడవీధుల ఆధునీకరణ, ఉద్యానవనాల ఏర్పాటు, ప్రత్యేక క్యూలైన్ల నిర్మాణం, అన్న ప్రసాద సత్రం, ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారు.


సగమే పూర్తయిన కోదండరాముడి కల్యాణ వేదిక

ఎత్తిపోయిన శ్రీరామ ఎత్తిపోతల పథకం

ఒంటిమిట్ట కోదండరామాలయం ఆనుకొని ఉన్న ఒంటిమిట్ట చెరువుకు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువును శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా తెలుగుదేశం ప్రభుత్వం 33.44 కోట్లతో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి నీరందిస్తే ఆ పథకం నిర్వహణలో కూడా జగన్ ప్రభుత్వం విఫలమైంది. ఈ పథకం నిర్వహణ బాధ్యతలను చేపట్టాల్సిన సంబంధిత శాఖ చేతులెత్తేసింది. నిర్వహణ బాధ్యత అనగా కరెంటు బిల్లులు కట్టడం, మోటార్లను రిపేర్లు చేయించుకుంటూ ఉండటం, వాటి రిపేర్ల ఖర్చు, అక్కడ సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాల్సి ఉంది. అయితే ఎత్తిపోతల పథకానికి సంబంధించిన నిర్వహణ బాధ్యతలను చెరువు ఆయకట్టు రైతులే భరించాల్సి ఉందని పేర్కొంటూ ఇది తమ బాధ్యత కాదని, చెరువుకు నీరందించడం మానేశారు. కారణం కరెంటు చార్జీలు కట్టలేక, నిర్వహణ ఖర్చులు భరించలేక ఆయకట్టు రైతులపై ఈ నెపం తోసేశారు. ప్రస్తుతం సోమశిల బ్యాక్‌వాటర్ పూర్తిగా అడుగంటింది. దానికి తగ్గట్లు ఎత్తిపోతల పథకం పైపులైన్లు లేకపోవడంతో ప్రస్తుతం చెరువుకు నీరందించలేని పరిస్థితి ఏర్పడింది. అంటే ఒక చెరువుకు కేవలం కోదండరాముని ఆలయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంత పెద్ద భారీ మొత్తంలో నిధులు కేటాయించి టీటీడీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తే దాని పరిపాలనా బాధ్యతలు చూసుకోలేని నేటి ప్రభుత్వం, ప్రభుత్వ నిర్వాహకం వల్ల ఎత్తిపోతల పథకం ఎత్తిపోయి చెరువులో చుక్క నీరు లేక నేడు బ్రహ్మోత్సవాల వేళ వెలవెలబోతూ ఇప్పటి ప్రభుత్వ పనితీరును కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. దీనివల్ల ఆయకట్టు రైతులకు నీరందకపోగా భూగర్భజలాలు అడుగంటి తాగునీరు లభించకపోగా చెరువు కట్ట సుందరీకరణ ఏమాత్రం ముందుకు సాగక ట్యాంక్ బండ్ రీతిలో అభివృద్ధి అటకెక్కిపోయింది.



సగమే పూర్తయిన కల్యాణ మండపం

ప్రధానంగా కోదండరాముని కల్యాణ మండపం సగమే పూర్తయింది. రాత్రివేళ పండు వెన్నెల పున్నమి రాత్రిలో జరిగే ఈ కల్యాణోత్సవానికి లక్షల మంది భక్తులు వస్తారు. ఆ భక్తులకు తగ్గట్టు కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కల్యాణ మండపం సగభాగం పూర్తయిందే తప్ప మిగిలిన అర్ధభాగం పూర్తి చేయలేదు. దీనిపై టీటీడీ ఏమాత్రం దృష్టి పెట్టలేదు. ఆలయానికి సమీపంలో చెరువు కట్టపై ఆంజనేయుడి విగ్రహం, జాంబవంతుడి విగ్రహాలు, శ్రీరాముడి విగ్రహాలు, స్వాగత తోరణాలు, మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ఏర్పాటు చేయాల్సి ఉండగా అవి కూడా ఏర్పాటు చేయలేదు. కోదండ రాముడి జన్మస్థలి ఒంటిమిట్టను తిరుమల రీతిలో అన్ని రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆధ్యాత్మిక శోభను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు తగ్గట్టు ఏ పనీ చేయలేదు. ఒంటిమిట్ట ఆలయ భక్తుల కోసం ఏర్పాటు చేస్తామన్న ధ్యానమందిరం జాడే లేదు. కడప, రాజంపేట నుంచి ఆలయానికి వచ్చే ప్రధాన మార్గంలో రాత్రివేళ కనువిందు కలిగించే రీతిలో దేదీప్యమానంగా వెలిగే లైట్లను ఏర్పాటు చేయలేదు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే రీతిలో కోదండరాముడి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయలేదు. టూరిజం హబ్ ద్వారా ఏర్పాటు చేస్తున్న అభివృద్ధి పనులు ఏ ఒక్కటీ జరగలేదు. బ్రహ్మోత్సవాల వేళ టీటీడీ సిబ్బంది అంతా ఒంటిమిట్టకు చేరుకుని ఆర్భాటంగా పనులు చేస్తారు తప్ప అనంతరం మచ్చుకైనా ఆవైపు ఏడాది పొడవునా కనిపించరు. 100 కోట్ల మాస్టర్ ప్లాన్ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించలేదు. జిల్లాకు సంబంధించిన నేత ముఖ్యమంత్రి అయినప్పుడు అదే జిల్లాలోని రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక సంపదగా గుర్తింపబడ్డ కోదండరాముడి ఆలయ అభివృద్ధికి ఏమాత్రం శ్రద్ధ చూపలేదు. తెలంగాణాలో గత ముఖ్యమంత్రి కేసీఆర్ యాదగిరి గుట్టను దేశంలోనే ఓ ఉన్నత ఆలయంగా వంద కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేసి తిరుగులేని రీతిలో అభివృద్ధి చేశారు. అయితే జిల్లా వాసి ముఖ్యమంత్రి అయినా రాష్ట్ర ఆధ్యాత్మిక సంపద కేంద్రంగా ఉన్న ఒంటిమిట్టను అభివృద్ధి చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై వివరణ కోసం టీటీడీ అధికారులను సంప్రదించగా వారు ఎవ్వరూ అందుబాటులో లేరు..

జగన్ ప్రభుత్వానికి భక్తుల మనోభావాలు పట్టవు



జగన్ ప్రభుత్వానికి అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లు తన సొంత జిల్లాలో ఉన్న భక్తుల మనోభావాలు పట్టలేదు. జిల్లాలో ఇంత విశిష్టమైన ఆలయం ఉందని, దానిని అభివృద్ధి చేయాలని ఏనాడూ ఆయన ధ్యాస లేదు. తన అతిథి గృహం ఉన్న ఎనుములు, ఎద్దులు తిరిగే అటవీ ప్రాంతమైన ఇడుపులపాయకు నాలుగు లేన్ల రోడ్డు వేయించుకోవడంలో ఉన్న శ్రద్ధ ఈ ఆలయంపై ఒక శాతం కూడా లేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టితో ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి వంద కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని ఆదేశాలు ఇచ్చినా వాటిని పూర్తి చేయాల్సి ఉండగా ఆ ఆలోచనే లేదు. సరికదా ఈ ఐదేళ్లలో ఒక్క పైసా నిధులను కూడా ఈ ఆలయ అభివృద్ధికి కేటాయించలేదు. అందువల్లే ఒంటిమిట్ట ఎత్తిపోతల పథకం ఎత్తిపోయి అటు రైతులకు సాగునీరు రాక, ఇటు ప్రజలకు తాగునీరు అందక చెరువులో చుక్కనీరు లేక పర్యాటక శోభ కూడా కనుమరుగైంది. దీనిని కోదండరాముని భక్తులు ఎప్పటికీ క్షమించరు.

- బొబ్బిలి రాయుడు, భక్తుడు, ఒంటిమిట్ట

భక్తుల మనోభావాలకనుగుణంగా అభివృద్ధి చేయాలి..



తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వహణలో కోదండరామాలయం ఉంది. ఇది రాష్ట్ర ప్రజల ఆధ్యాత్మిక సంపద. ఈ ఆలయాన్ని భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఈ ఆలయం అటు ఆధ్యాత్మికంగానూ, చారిత్రకంగానూ, పర్యాటకపరంగానూ ఎంతో ప్రాశస్త్యమైన ప్రాంతం. తెలంగాణా, ఆంధ్రా, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు దేశంలోని ఇతర ప్రాంతాల భక్తులు నిత్యం ఈ ఆలయానికి వస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టుగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయమని భక్తుల తరఫున కోరుతున్నాం.

- కొమరా వెంకటనరసయ్య, భక్తుడు, ఒంటిమిట్ట

సింహుడిపై శ్రీరాముడి చిద్విలాసం


సింహ వాహనంపై పట్టాభిరాముడు

వాల్మీకిపురం, ఏప్రిల్ 14 :వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం సుప్రభాతసేవతో మొదలు ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులను కల్పవృక్ష వాహనంపై విశేషాలంకరణలు చేసి పురవీధులలో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్నపనతిరుమంజనం వేడుకగా సాగింది. సాయంత్రం ఆలయంలో విశేష భక్తజనం నడుమ రాముడి ఊంజల్‌సేవ వేదపండితులు కమనీయంగా నిర్వహించారు. రాత్రి సీతాలక్ష్మణ సమేతుడైన పట్టాభిరాముడు సింహవాహనంపై పట్టణ పురవీధుల గుండా వైభవంగా నిర్వహించగా తిలకించిన భక్తజనం పరవశించిపోయారు. స్థానిక కృష్ణదేవరాయ బలిజసేవా సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక డోలు కునిత నృత్యాలు, తమిళనాడు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి,ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సర్వభూపాల వాహనసేవ, స్నపనతిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి పెద్దశేష వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి.

ఆదర్శప్రాయుడు డాక్టర్ అంబేడ్కర్ : కలెక్టర్


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావి తరాలకు ఆదర్శప్రాయుడని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేడ్కర్ లాంటి గొప్ప వ్యక్తి భారతగడ్డపై ఉండడం ఎంతో గర్వకారణమన్నారు. బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన గొప్ప ఎనలేని సంపద అయిన రాజ్యాంగం వల్లనే మనమంతా ప్రజాస్వామ్యంలో బలంగా నిలబడగలిగామన్నారు. అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో ప్రతి ఒక్కరూ ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో రంగస్వామి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ఓటుహక్కును వినియోగించుకోండి

బి.కొత్తకోట, ఏప్రిల్ 14: రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఓటరు దర్జాగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఓటర్లను కోరారు. బి.కొత్తకోట మండలంలోని గట్టు గ్రామంలో ఆదివారం సమస్యాత్మక పోలింగ్ బూత్‌లైన 177, 178, 179, 180 పరిధిలోని ఓటర్లతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఓటరూ నిర్భయంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకోవచ్చునని, అందుకు అధికార యంత్రాంగం అన్నివిధాలా సహకారం అందిస్తుందన్నారు. నాయనిబావి గ్రామం 4 కి.మీ.ల దూరం ఉందని, ఓటు వేసేందుకు తాము ఇక్కడికి రావాల్సి వస్తోందని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా, ఈసారికి ఏమీ చేయలేమని వచ్చే ఎన్నికలలో పోలింగ్‌బూత్ మార్పిడికి ప్రయత్నిస్తామని వారికి తెలిపారు. అంతకుముందు ఆయన బి.కొత్తకోట మండలంలోని బెంగళూరు రోడ్డులోని ఠాణామిట్ట చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం హార్సిలీహిల్స్‌కు వెళ్లి గవర్నర్ బంగ్లాలో విడిది చేశారు. కార్యక్రమంలో ఎస్పీ క్రిష్ణారావు, జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, డీఎస్పీ ప్రసాద్, సీఐ సూర్యనారాయణ, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో నూర్జహాన్, ఆర్ఐ బాలాజీ, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచార రథంపై వైసీపీ నాయకుల దాడి

- డ్రైవర్‌కు గాయాలు


డ్రైవర్ వెంకటశివకుమార్‌ను పరామర్శిస్తున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రాయచోటి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి చెందిన ప్రచార రథంపైన ఆదివారం రామాపురం మండలం కల్పనాయనిచెరువులో వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ దాడిలో ప్రచారరథం మైకులు, లైట్లు ధ్వంసం కాగా డ్రైవర్ మాదా వెంకటశివకుమార్ గాయపడ్డాడు. ఈ దాడి విషయం తెలిసిన వెంటనే రాంప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో సంఘటనా స్థలానికి వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించి రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ రామాపురం మండలం కల్పనాయనిచెరువులో తమ ప్రచార రథం తిరుగుతోందన్నారు. దీనిని జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు తమ ప్రచారరథంపై దాడి చేశారన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సొంత గ్రామం నుంచి పలువురు తమకు మద్దతుగా వస్తున్నారని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే మనుషులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. మరోసారి ఇటువంటి సంఘటనలకు పాల్పడితే మేము కూడా అదే భాషలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. రాయచోటి పట్టణంలోని ఠాణా నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రాంప్రసాద్‌రెడ్డి గాయపడ్డ డ్రైవర్‌తో ర్యాలీగా వచ్చి దాడి సంఘటనపై నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చి చికిత్స పొందుతున్న డ్రైవర్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. జగన్‌పై రాళ్ల దాడి ఓ జగన్నాటకమన్నారు. ముఖ్యమంత్రిపై రాయి దాడి ఘటన ముందుగానే భద్రతా అధికారులకు తెలుసని, ఇది జగన్ బృందం ఆడిన నాటకమన్నారు. ఈ డ్రామాను రక్తి కట్టించాలంటే తక్షణమే గులకరాయి సంఘటనపై స్థానిక పోలీసులతో కాకుండా సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో రాష్ట్రంలో సంచలనమైన ఘటన జరుగుతుందని, ఎన్నికల మూడ్ మార్చేస్తుందని వైసీపీ నాయకుడు ఆవుల శ్రీధర్‌రెడ్డి చెప్పిన నాలుగో రోజే ఈ గులకరాయి సంఘటన జరగడం డ్రామాలో భాగమేనన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి అధికార పార్టీకి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో కొత్తడ్రామాకు తెరలేపారని విమర్శించారు. జగన్‌పై రాయి దాడి ముమ్మాటికీ భద్రతా వైఫల్యమే. దాడి జరిగినపుడు చుట్టూ ఉన్నది కూడా వైసీపీ కార్యకర్తలే అటువంటప్పుడు పోలీసులు నిందితుడిని ఎందుకు పట్టుకోలేదని ఆయన ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ప్రచార రథం, డ్రైవర్‌పై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. దాడి సంఘటన తెలియడంతో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

ఐక్యతతో వైసీపీని ఓడిద్దాం

- బలిజల ఆత్మీయ సదస్సులో నల్లారి కిరణ్



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె, ఏప్రిల్ 14: రాయలసీమలో శక్తివంతమైన బలిజలు ఉన్నారని, వారిలో ఐక్యత ద్వారానే అనుకున్నది సాధించవచ్చని, అందరం ఐక్యంగా పోరాడి వైసీపీని ఇంటికి సాగనంపుదామని తెలిపారు. మదనపల్లె సీఎస్ఐ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన బలిజల ఆత్మీయ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒక కులంతో ఎవరూ రాజకీయం చేయలేరని, ఆ విధంగా గెలుపు కూడా సాధ్యం కాదని పవన్‌కళ్యాణ్ బలిజలకే కాదని, అందరికీ నాయకుడని కొనియాడారు. పవన్‌కళ్యాణ్ ఇప్పటికీ స్ట్రగుల్ స్టారేనని, సినీరంగం తరహాలోనే ఈ ఎన్నికల్లో రాజకీయంగా మీరంతా ఆమోదిస్తేనే పవన్ స్టార్ అవుతారని ఆయన స్పష్టం చేశారు. పిఠాపురం ఎవరో ఓడిస్తే ఓడిపోయే నియోజకవర్గం కాదని, తాను సీఎంగా ఉన్నప్పుడు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పవన్‌కు మద్దతుగా తాను కూడా అక్కడ ఎన్నికల ప్రచారం చేయడంతో పాటు ఇక్కడ ప్రచారానికి పవన్‌ను కూడా ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చట్టబద్ధతలేని రాజకీయాలను తయారు చేశారని, అడ్డొచ్చిన వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసినట్లు చెప్పారు. మనకేమిలే..నా వరకూ రాలేదని అనుకోవద్దని, ఈరోజు ఎవరికో వచ్చింది.. రేపు నీకూ వస్తుందని గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. మనలో విభేదాలు పక్కన పెట్టి, ఐక్యతతో ముందుకెళ్లాలని సూచించారు. బలిజ సంఘం నాయకుడు శ్రీరామ రామాంజనేయులు మాట్లాడుతూ బలిజలంతా ఐక్యంగా ఉంటూ హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులైన షాజహాన్ బాషా, ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించడం ద్వారా మన హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా మాట్లాడుతూ బలిజలపై దొంగ, అవకాశవాద, సందర్భోచిత, కపటప్రేమ చూపే వైసీపీని నమ్మొద్దని కోరారు. రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు కేవలం ఓటు ద్వారా ఎమ్మెల్యే, ఎంపీని ఎన్నికునేవి కావని, మన ప్రాంతం అభివృద్ధి, మన పిల్లల భవిష్యత్తుకు జరుగుతున్న ఎన్నికలుగా భావించి నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశంలో కాపు సంఘం నేతలు దారం అనిత, జంగాల శివరాం, ఆంజనేయకుమార్, కురవంక మోహన్, కోసూరి రామ్మూర్తి, రాయల్ గణిలు మాట్లాడారు. సదస్సులో బలిజసంఘం నాయకులు దారం అనిత, దారం హరిప్రసాద్, జంగాల శివరాం, శ్రీరామ హరిహరణ్, ప్రసాద్‌కుమార్, ఓసూరి కిరణ్‌కుమార్, సంఘం శ్రీనివాసులు, అమరనారాయణ, పూల నాగరాజ, చొక్కం సత్యనారాయణ, రాయల్ గణి, ఎం.నాగేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



రాజంపేటను జిల్లా కేంద్రం చేయడానికి గళమెత్తుతా..

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట/సుండుపల్లె, ఏప్రిల్ 14: తనను నియోజకవర్గ ప్రజలు దీవించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజంపేటను జిల్లా కేంద్రం చేసుకోవడానికి అసెంబ్లీలోనే గళమెత్తుతానని రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తాము ఎమ్మెల్యేగా గెలుపొందడం తథ్యమని, ఈ సమయంలో నారా చంద్రబాబునాయుడును ఒప్పించి రాజంపేట ప్రజల మనోభావాలకు అనుగుణంగా జిల్లా కేంద్రం చేయాలని పట్టుబట్టి సాధిస్తానన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటాను తప్ప తగ్గే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా స్థానిక సాయినగర్‌లో పెద్దఎత్తున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని, టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా టీడీపీ సూపర్ సిక్స్ అభివృద్ధి పథకాలను ప్రజలకు అందజేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాయినగర్ టీడీపీ నాయకులు నీలి ఈశ్వరయ్య, ఎస్.కె.రాజు, కృష్ణమూర్తి, ఎ.సుబ్రమణ్యం, ధనుంజయ, కృష్ణంరాజు, రమణ, నీలి చెంగారావు, తోట శ్రీనివాసులు, పంతుల్ రవీంద్ర, మహిళా నేతలు వాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు.

జగన్ పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు

అంబేడ్కర్ రాజ్యాంగానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తూట్లు పొడిచారని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకొచ్చారని సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సుండుపల్లె మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక న్యాయం కోసం టీడీపీ పోరాడుతోందని, చంద్రబాబునాయుడు సీఎం అయితేనే అంబేడ్కర్ రాజ్యాంగం అమలులో ఉంటుందని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కూటమి అధికారంలోకి రావాలని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ లీగల్ సెల్ కన్వీనర్ ఈశ్వరయ్య, టీడీపీ నాయకులు వై.శివరామిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ రామాంజనేయులు, దామోదర్‌నాయుడు, చెన్నంశెట్టి వెంకట్రమణ, ప్రతాప్‌రెడ్డి, యర్రంరెడ్డి, జనార్ధన్‌నాయుడు, జనసేన నాయకులు రామాశ్రీనివాస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సుండుపల్లెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బాలసుబ్రమణ్యం

24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలి

- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల విధుల శిక్షణకు గైర్హాజరైన పీఓలు, ఏపీఓలు 24 గంటల్లోగా సంజాయిషీలు సమర్పించాలని, లేనిపక్షంలో తగు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన పీఓలు, ఏపీఓల శిక్షణకు 2550 మంది హాజరు కావాల్సి ఉండగా, 41 మంది గైర్హాజరవడంతో జిల్లా ఎన్నికల అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై క్రమశిక్షణారాహిత్య చర్యల కింద షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. 24 గంటల్లోపు తగు సంజాయిషీ ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో ఆదేశించారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

కడప రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధు సూదన్



పీఓ, ఏపీఓల శిక్షణలో సూచనలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 14: ఎన్నికల ప్రకియలో పోలింగ్ కేంద్రాల్లో కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని ప్రిసైడింగ్, సహాయఅధికారులకు కడప నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధుసూదన్ సూచించారు. ఆదివారం గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల విధులకు నియమించిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కడప రిటర్నింగ్ అధికారి మధు సూదన్ అధ్యక్షతన రెండో రోజు శిక్షణ జరిగింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను సజావుగా నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా జరిపేందుకు ప్రిసైడింగ్ అధికారులు, సహాయ అధికారుల పాత్ర కీలకమైందన్నారు. శిక్షణలో పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం మాస్టరు ట్రైనర్లు డెమో, బ్యాలెట్ బ్యాక్సులు, వీవీ ప్యాడ్స్ చూపిస్తూ నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలపై పవర్ పాయిట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఘనంగా ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్14: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవా లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ప్రాంభిం చారు. అగ్నిప్రమాదాల నివారణ చర్య లు గురించి తెలిపే కరపత్రాలను, పోస్టర్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజ లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కలెక్టర్ వివరించారు.

బ్రిడ్జిని ఢీకొన్న కారు - ఒకరి మృతి

ఖాజీపేట, ఏప్రిల్ 14: కడప-కర్నూలు జాతీయ రహదారిపై ఆంజనేయపురం వద్ద బ్రిడ్జిని కారు ఢీకొనడంతో మేడా రవీంద్ర (57) మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు కడప వాసులు ఆంజనేయులు, శ్రీనివాసులు పని నిమిత్తం ప్రొద్దుటూరు సమీపంలోని పల్లవోలుకు వెళ్లి అక్కడి నుంచి ప్రొద్దుటూరులోని రవీంద్రను కలిసి తిరిగి సాయంత్రం కడపకు వస్తుండగా చెన్నూరు బ్రిడ్జిని ఢీకొన్నారు.ఇందులో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రవీంద్ర మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు.

భర్త, అత్త,మామ అరెస్టు

కడప(క్రైం), ఏప్రిల్ 14: కడప నగరం మృత్యుంజయకుంటలో వివాహిత ఆత్మహత్యకు కారకులైన భర్త, అత్తమామను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మృత్యుంజయకుంట వాసి కుళాయమ్మ అనంతపురం వాసి కుళాయప్పతో ఏడాది కిందట వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసులో భర్త కుళాయప్ప అతని తండ్రి కుళాయప్ప, తల్లి కుళాయమ్మను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

రూ.3లక్షలు నగదు పట్టివేత

పెనగలూరు, ఏప్రిల్14: ఎన్నికల నియమావళిలో భాగంగా ప్రత్యేక పోలీసు బలగాలు ఆదివారం సాయంత్రం నారాయణ నెల్లూరు వద్ద ఓ కారులో తరలిస్తున్న మూడు లక్షల రూపాయలు నగదును పట్టుకుని ట్రెజరీలో అప్పజెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై పెనగలూరు ఎస్ఐ సుభాష్, చంద్ర బోస్‌ను వివరణ కోరగా ఎలక్షన్స్ స్క్వాడ్, రెవెన్యూ బృందాలు నారాయణ నెల్లూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో రూ.3లక్షల నగదు, విద్యుత్ గృహోప కరణాలు దొరికినట్లు తెలిపారు.

క్లాప్ ఫ్లాప్



- తిరగని క్లాప్ ఆటోలు
- నిలిచిపోయిన ఇంటింటి చెత్త సేకరణ
- నిర్వహణపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- వీధి వీధినా దర్శనమిస్తున్న చెత్త దిబ్బలు
- మందకొడిగా చెత్త పన్ను వసూళ్లు
- శానిటేషన్ అధికారుల వైఫల్యం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 14: ఇంటింటా చెత్త సేక రణ కార్యక్రమం ఆర్భాటంగా చేపట్టినా అమలు మాత్రం విఫలమైందని చెప్పవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ (క్లాప్) అమలులో మాత్రం చతికల పడిందని చెప్పవచ్చు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు మున్సిపాలిటీల్లో ఇంటింటి నుంచి చెత్తసేకరణ కోసం వాహనాలను ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యత ప్రైవేటు ఏజన్సీలకు అప్పగించింది. కానీ అనుకున్నంత స్థాయిలో చెత్త పన్ను వసూలు కావడంలేదు. దీంతో క్లాప్ వాహనాల ఏజన్సీకి మున్సిపాలిటీలు అద్దెలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా క్లాప్ వాహనాల మెయింటెనెన్స్, మరమ్మత్తులకు, సిబ్బందికి జీతాలు చెల్లించడం భారమైంది. మున్సిపల్ శానిటేషన్ అధికారుల వైఫల్యంతో సకాలంలో చెత్త తరలింపు పనులు చేపట్టలేక పోవడంతో వీధి వీధిన చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లన్నీ దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. వివరాల్లోకెళితే...

జిల్లాలో కడప ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో 2022 మార్చి1 నుంచి క్లాప్ వాహనాలు ప్రారంభించి ఇంటింటా చెత్తసేకరణ పనులు ప్రారంభించారు. కడపలో 100 వాహనాలు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 40 వాహనాలు అవసరం వుండగా 35 వాహనాలు అందుబాటులో వుంచారు. కడపలో 100 వాహనాలకు నెలకు రూ. 56,81,678 ప్రొద్దుటూరులో 35 వాహనాలకు నెలకు రూ. 24,35,004 మున్సిపాలిటీ ఏజన్సీకి చెల్లిస్తోంది. ఈ ప్రకారం ఒక్కో వాహనానికి నెలకు రూ.64 వేల అద్దె చెల్లిస్తున్నారు. ఈ అద్దె మున్సిపాలిటీల్లో యూజర్ చార్జీల పేర చెత్తపన్ను వసూలు చేసి చెల్లించాల్సివుంది. అయితే ప్రజల్లో చెత్త పన్ను పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుండడంతో అనుకున్నంత స్థాయిలో వసూళ్లు కావడంలేదు. ప్రత్యేకంగా వార్డుకు ఒక సచివాలయ శానిటరీ సెక్రటరీ వున్నా యూజర్ చార్జీల వసూళ్లలో వెనకబడ్డారు. దీంతో ఏజెన్సీలకు సకాలంలో మున్సిపాలిటీలు అద్దె చెల్లించకపోవడంతో ఏజెన్సీలు డ్రైవర్లుకు జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. ఏజన్సీలు క్లాప్ వాహనాల డ్రైవర్లుకు సూపర్ వైజర్లుకు జీతాలు చెల్లించలేక మరమ్మత్తులు సైతం చేపట్టలేక ఆటోలు నిలిచిపోయాయి. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ సిబ్బంది విధులు నిర్వహించబోమని ఫిబ్రవరి నుంచి ఆటోలు తిప్పడం బంద్ చేశారు. దీంతో కసువు సేకరణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కడప ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో క్లాప్ ఆటోలు కొన్నింటిని తిప్పుతూ డ్రైవర్లుకు జీతాలు ఇచ్చేలా డీజల్ ఖర్చు భరించేలా అధికారులు చర్యలు తీసు కుంటున్నారు.

చేతులెత్తేసిన ఏజన్సీ

మున్సిపాలిటీలు అద్దె సకాలంలో చెల్లించలేకపోవడంతో ప్రొద్దుటూరులో క్లాప్ వాహనాల సేవలను రెడ్డి ఏజన్సీ బంద్ చేసి చేతులెత్తేసింది. దీంతో వాహనాలన్నీ మున్సి పాలిటీలో ఎక్కడికక్కడ నిలిపివేశారు. చాలా రో జులుగా మూలన పడడంతో టైర్లు పాడైపోయాయి. వాహనాల పైన వుండే చెత్త డోర్లు తీసుకెళ్లారు. మరికొన్ని తుప్పు పట్టే పరిస్థితి ఏర్పడింది.

మున్సిపాలిటీలకు భారం....

36 క్లాప్ వాహనాల్లో 18 వరకు పూర్తిగా బాగా దెబ్బతిన్నాయి. కేవలం 18 ఆటోలు మాత్రమే కొంత మరమ్మత్తులు చేయించి మున్సిపల్ అధికారులు వాటితో సేవలు పునరుద్దరించే పనులు చేపట్టారు. ఏజన్సీతో సంబంధం లేకుండా కేవలం క్లాప్ డ్రైవర్లకు జీతాలు నేరుగా చెల్లించేందుకు, డీజల్ ఖర్చులు భరించేందుకు కౌన్సిల్ తీర్మానం తీసుకున్నారు.

వీధుల్లో చెత్త దిబ్బల కంపు

పట్టణంలో మళ్లీ చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి చెత్త తరలింపులో జాప్యం జరుగుతుండడంతో కుళ్లి కంపుకొడుతున్నాయి. కేవలం 18 క్లాప్ ఆటోలు మాత్రమే తిరుగుతున్నాయి. చాలా వార్డుల్లో పుష్‌కాట్‌తో సేకరించిన చెత్త నేరుగా డంపింగ్ యార్డుకు వెళ్లకుండా రోడ్లపై చెత్త పాయింట్లవద్ద సిబ్బంది వేస్తున్నారు. ఈ చెత్త దిబ్బలు సకాలంలో తరలించడంలో జాప్యం జరుగుతుండడంతో వాటిని పందులు అపరిశుభ్రం చేస్తున్నాయి.

18 క్లాప్ వాహనాలు, 10 ట్రాక్టర్లు, మూడు పెద్ద కంపాక్టర్లు, మూడుచిన్న కంపాక్టర్లతో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించే పనుల్లో శానిటేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం తలెత్తింది. దీంతో పట్టణంలో పారిశుధ్య సేవల్లో విఫలం అవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని మున్సిపల్ ఉన్నతాధికారులు సైతం అంగీకరిస్తున్నారు.

వినియోగంలో సగం పుష్‌కాట్‌లు

మున్సిపాలిటీలో 41 వార్డులు వుంటే క్లాప్ వాహనాలు అందులో సగం వార్డులకు కూడా సేవలు అందడం లేదు. దీనికి తోడు కమర్షియల్ వ్యర్థాల సేకరణకు ప్రత్యేకించి వాహనాలు లేవు. ఇందువల్ల చాలా వార్డులో ఇంటింటి చెత్త సేకరణకు పుష్‌కాట్‌లు తీసుకెళ్లి సేకరించాలన్నా పుష్‌కాట్‌లలో 180 వుంటే అందులో కేవలం 90 మాత్రమే పనిచేస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. దీంతో చాలా వార్డుల్లో చెత్త సేకరణ సక్రమంగా సాగడం లేదు.





నిలిచిపోయిన క్లాప్ వాహనాలు - మడూరు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

పారిశుధ్య సేవలు మెరుగు పరుస్తాం



ప్రొద్దుటూరులో పారిశుధ్య సేవల్లో జాప్యం జరుగుతున్న మాట వాస్తవం. గతంలో ఒక ఏడాది పైగా క్లాప్ ఆటోలతో నేరుగా ఇంటింటి నుంచి సేకరించిన చెత్త డంపింగ్ యార్డుకు వెళ్లేది. క్లాప్ ఆటోలు నడపడంలో ఏజన్సీ చేతులెత్తేసింది. ఏజన్సీతో సంబంధం లేకుండా మున్సిపాలిటీనే నేరుగా క్లాప్ ఆటో డ్రైవర్లుకు జీతాలు చెల్లించేలా కౌన్సిల్ తీర్మానం తీసుకున్నాం. డీజల్ ఖర్చులు మున్సిపాలిటీనే భరిస్తోంది. అందువల్ల 18 ఆటోలను తిప్పుతున్నాం. ఇవి సగం వార్డులకే సేవలు అందించగలవు. కంపాక్టర్లు ట్రాక్టర్ల ద్వారా చెత్తపాయింట్ల వద్ద నుంచి సకాలంలో తరలింపు జరగడం లేదు. శానిటేషన్ అధికారుల మధ్య సమన్వయ లోపం, వర్కర్లపై నియంత్రణ లేదు. వారం పది రోజుల్లో పారిశుధ్య సేవలు పూర్తి స్థాయిలో మెరుగు పరుస్తాం.

రఘునాథరెడ్డి మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు.

132 వాహనాలు సీజ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 14: ప్రొద్దుటూరులోని అమృతానగర్‌లో ఉదయం నిర్వహించిన పోలీస్ తనిఖీల్లో 132 వాహనాలు సీజ్ చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. డీఎస్పీ నేతృత్వంలో సీఐలు యుగంధర్, శ్రీకాంత్, వెంకటరమణ, అబ్దుల్ కబీర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ రికార్డులు లేని 132 వాహనాలను సీజ్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బైక్, ఆటో, ఇతర వాహనాలను తప్పనిసరిగా రికార్డులు ఉండాలని లేదుంటే ఆ వాహనాలను సీజ్ చేస్తామని ఆయన చెప్పారు.

దాడి చేసిన కేసులో వ్యక్తి అరెస్టు

కడప(క్రైం), ఏప్రిల్ 14: కడప నగరం 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లె వాసి వంశీపై దాడి చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాలూకా పోలీసులు ఆదివారం తెలిపారు. ఆలంఖాన్‌పల్లెలోని రాణితోట వీధికి చెందిన వంశీ, అదే ప్రాంతానికి చెందిన యువతిని కొన్నేళ్ల కిందట కులాంతర వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సహా అక్కడే ఉండేవాడు. కాగా కొద్దిరోజుల కిందట సొంతూరికి వచ్చాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంటివద్ద ఒంటరిగా ఉన్న వంశీపై అదే గ్రామస్థుడు వెంకటేష్ అలియాస్ వంశీ, తిరుపతి సురేంద్ర అలియాస్ జాకీ బీరుబాటిల్‌తో దాడి చేశారు. వీరికి గతంలోనే మనస్పర్థలుండేవి. వంశీ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌టీపీపీ క్యాంటిన్ టెండర్లు ఉపసంహరించుకోవాలని పరోక్ష బెదిరింపులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 14: డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు క్యాంటిన్ ప్రాజెక్టు హాస్టల్‌కు 2024 - 2025కు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు దాఖలుకు ఏప్రిల్ 15న ఆఖరి తేది నిర్ణయించారు. ఇప్పటికే ఈ టెండర్ల కోసం 8 మంది సివిల్ కాంట్రాక్టర్లు షెడ్యూల్ పారాలు తీసుకున్నారు. షెడ్యూలు ఫారం రూ.800, డీడీ రూ.30,000 వేలు చెల్లించి పాల్గొననున్నారు. అయితే ఇదివరకే నిర్వహిస్తున్న వ్యక్తికే క్యాంటిన్ టెండరు దక్కేందుకు కొందరు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు హాస్టల్ నిర్వహణలో టీ, కాఫీ, టిఫెన్, భోజనం అందుబాటులో వుంటుంది. వీటికి ప్రాజెక్టు అధికారులు నిర్ణయించిన ధరలకంటే తక్కువ కోట్ చేసిన వారికే ఈ టెండరు దక్కుతుంది. కానీ ప్రాజెక్టు హాస్టల్ టెండర్లలో పాల్గొనే వారిని ఉపసంహరించుకోవాలని కొందరు బెదిరిస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. వారు ఉన్నత స్థాయిలోవున్న వ్యక్తులు కావడం చేత కొందరు ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు సమాచారం. పాత వ్యక్తులకే ఇవ్వడానికి టెండర్లు ఎందుకు విడుదల చేయాలని టెండర్ షెడ్యూలు పారాలు కొని డీడీలు చెల్లించాక ఇలా ఒత్తిళ్ళు పెంచటం సరికాదని వాదిస్తున్నారు. ఇందులో కొందరు అధికారులకు మామూళ్ళు అందుతున్నందువల్ల వారు తమకు అనుకూలంగా వుండే వ్యక్తులకు టెండరు దక్కేలా పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. దీనిపై ఎస్ఈ(సివిల్) శ్రీధర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరడానికి ఆయనకు ఫోన్‌చేస్తే ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

బాలికను ఇబ్బంది పెడుతున్న వ్యక్తిపై కేసు నమోదు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 14: ప్రేమ పేరుతో బాలికను ఇబ్బంది పెడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని బాలికపై ఎస్టీ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవరు మస్తాన్‌వలి ప్రేమ పేరుతో ఇబ్బంది పెడుతూ చెడుగా ప్రచారం చేస్తున్నారని బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఇది ఇలా ఉండగా పోలీసులు స్టేషన్‌కు పిలిపించి తనను అవమానకరంగా మాట్లాడారని మస్తాన్‌వలి విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు అతనికి చికిత్స అందించారు. సంఘటనపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఆటో బోల్తా - ఒక్కరికి గాయాలు

నందలూరు, ఏప్రిల్14: చెయ్యేరు వంతెనపై ఆదివారం అదుపు తప్పి ఆటో బోల్తాపడడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమి కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆటో బోల్తా పడడంతో వంతెనపై ట్రాఫిక్ స్తంభించింది.



కోదండరాముని బ్రహ్మోత్సవాలు చూతము రారండి

- సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న ఆలయం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 14: శ్రీరామచంద్రుని, సీతమ్మ తల్లి పెళ్లి కనులారా చూతము రారండి అంటూ ఒంటిమిట్ట కోదండరామాలయం భక్త జనకోటికి స్వాగతం పలుకుతోంది. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కోదండరామాలయంలో పూర్తి స్థాయిలో ప్రత్యేక అలంకరణ చేపట్టారు. గతానికి భిన్నంగా టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లను చేపట్టారు. ఆలయ రాజగోపురం, ముఖద్వారం, దక్షిణ, ఉత్తర గోపురాలు, రామాలయ ప్రాంగణం ప్రత్యేక ప్రణాళికతో చేపట్టారు. భక్తుల కోసం రంగ మండపం, రామాలయ ప్రాంగణలో జర్మన్ టెక్నాలజీతో జర్మన్ షెడ్డును ఏర్పాటు చేశారు.

భక్తుల కోసం అన్నదానం

కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామాలయానికి విచ్చేస్తున్న భక్తులకు రామాలయం ఎదురుగా టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అన్నదానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లను చేపట్టింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన ఏర్పాట్లను టీటీడీ చేపట్టనుంది. వీటి కోసం తిరుమల నుంచి ప్రత్యేక వంట మాస్టర్లను, వంట సామగ్రిని, కావాల్సిన బియ్యం, కూరగాయలు తీసుకొచ్చేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే ఏర్పాట్లను టీటీడీ ప్రత్యేకంగా చేపట్టింది.

కల్యాణ వేదిక వద్ద ముమ్మర ఏర్పాట్లు

కోదండరాముని కల్యాణ వేదిక వద్ద టీటీడీ ప్రత్యేక అభివృద్ధి పనులను చేపట్టారు. గతేడాది కల్యాణంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులతో చర్చించి భక్తుల కోసం అభివృద్ధి పనులు టీటీడీ చేపడుతోంది. ప్రత్యేకంగా మహిళలకు, పురుషులకు శాశ్వత మరుగుదొడ్లను, కల్యాణం రోజున ప్రసాదం పంపిణీ కోసం ప్రత్యేక వంట శాలను, బ్రహ్మోత్సవాల రోజున పనిచేస్తున్న సిబ్బంది కోసం అన్నదానం ఏర్పాట్లు చేపడతారు. అండర్‌గ్రౌండ్ విద్యుద్దీపాలంకరణ, తాగునీటి కోసం సంప్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఓవర్‌ఫ్లో ట్యాంక్ నిర్మించారు. కల్యాణ వేదిక అభివృద్ధిలో భాగంగా నరవకాటిపల్లె రహదారి కల్యాణ మండపంలోకి రావడంతో వారి కోసం రైల్వేస్టేషన్ మీదుగా కొత్తగా రోడ్డును ఏర్పాటు చేశారు. వీటితో పాటు కల్యాణ తంతులో ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లును టీటీడీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.



సామాజిక మార్పునకు అర్థం అంబేడ్కర్

అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయం, కడప వైవీయూ, ఆర్కిటెక్చర్ వర్సిటీల్లో అంబేడ్కర్ జయంతి

రాయచోటిటౌన్, ఏప్రిల్14: బహుముఖ వ్యక్తిత్వం కలిగిన న్యాయ నిపుణుడు, విద్యావేత్త, ఆర్థిక వేత్త, సామాజిక సంస్కర్తగా దేశానికి, సమాజానికి విశేషమైన కృషి చేసిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సామాజిక మార్పునకు మార్గదర్శకుడని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకట సుబ్బయ్య వేర్వేరు కార్యక్రమాల్లో కొనియాడారు.

అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో భారతరత్న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలు రాబోయే తరాలకు కూడా మార్గదర్శకమన్నారు. అంటరానితనం, సామాజిక అసమానతలు పోగొట్టిన మహోన్నతమైన వ్యక్తిగా అంబేడ్కర్‌ను అభివర్ణించారు. కార్యక్రమంలో ఎస్పీ, అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ అడ్మిన్ శ్రీనివాసులు, హోంగార్డ్స్ ఆర్ఐ చలపతి, ఆర్ఐ ఎంటీఓ పెద్దయ్య, పోలీసు అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు - వైవీయూనివర్సిటీలో రిజిస్ట్రార్ తదితరులు

వైవీ యూనివర్సిటీలో..

కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 14: వైవీయూలో ఆదివారం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూలో : భారతరాజ్యాంగానికి రూపకల్పన చేసిన అంబేడ్కర్ దేశానికే గర్వకారణమని, ప్రముఖ న్యాయవాదిగా చిరస్మరణీయుడని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటరు మనోహర్‌రావు, పాల్గొన్నారు.

ఆర్‌జేడీ ఆధ్వర్యంలో : కడప నగరం కలెక్టరేట్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు తుపాకుల మురళి, ఎ.రామచంద్ర, ఎం.వెంకటసుబ్బయ్య, క్రిష్టపర్‌జాన్, రాజగోపాల్‌రెడ్డి, పలువురు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సామాజిక న్యాయం, సమానత్వానికి అంకితమైన గొప్ప వ్యక్తిడాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నేతలు ఇల్లూరు ఓబులేసు, ఎస్టీ సెల్ భాస్కర్, రాజశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ముద్దనూరు రాయుడు, బీసీ సెల్ నాయకులు వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, జీవన్, అనిల్, బిల్లా నవీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేత శ్రీనివాసరెడ్డి

రక్తదాన శిబిరం : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సందర్భంగా వివిధ స్వచ్ఛంద సేవకులు విజయకుమార్, నాగభూషణం, ఏపీ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప నగరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ధనుంజయ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

'ఎలక్షన్ మిత్ర'ను సద్వినియోగం చేసుకోండి : ఎస్పీ

కడప(క్రైం), ఏప్రిల్ 14: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నిరంతరం నిఘా ఉంచామని, ఇందులో భాగంగా నాకాబందీ, పల్లెనిద్ర నిర్వహిస్తున్నామని ఎస్పీ సిద్దార్థ కౌశల్ వెల్లడించారు. పోలీసు పెన్నా కాన్ఫరెన్సు హాలులో ఆదివారం అదనపు ఎస్పీ లోసారి సుధాకర్‌తో కలిసి విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ మిత్ర వెబ్‌సైట్‌ను ఎన్నికల సమయంలో సద్వినియోగపడేలా రూపొందించామన్నారు. భవిష్యత్తులో పోలీసు అధికారులకు కేసుల పరిష్కారంలో కూడా ఉపయోగ పడుతుందన్నారు. డీజీపీ రాజేంద్రనాథరెడ్డి, ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మార్గదర్శకంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎలక్షన్ మిత్ర.ఇన్ వెబ్‌సైట్‌ను ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా రూపొందించామన్నారు. ఈ వెబ్‌సైట్ ఎన్నికలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని పొందుపరిచామన్నారు. ఎన్నికల మాన్యువల్, హ్యాండ్‌బుక్, ప్రెస్‌నోట్లు, నోటిఫికేషన్లు మొదలైన వాటిని పొందుపరిచినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీసుశాఖ ఈ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జరిపిన తనిఖీల్లో దాడుల వివరాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో 43 నాటుసారా కేసులు నమోదు చేశాని 83 మందిని అరెస్టు చేసి 14,033 లీటర్ల నాటుసారాను సీజ్ చేశామన్నారు. నాటుసారా తయారీ కేంద్రంలో బెల్లంఊటను ధ్వంసం చేసి 341 కేసులు నమోదు చేశాని ఒకరిని అరెస్టు చేశామన్నారు. మద్యం కేసుకు సంబంధించి ఎస్డీపీఎల్ 174 కేసులు నమోదు చేయగా 208 మంది అరెస్టు చేశామని, వీరి నుంచి 3,24,974 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. మద్యం విలువ రూ.26,04,414 ఉంటుందన్నారు. మ ద్యం కేసులో బీపీఎల్ కేటగిరీలో 2563 కేసులు నమో దు చేసి, 2526 మందిని అరెస్టు చేశామని, వీరి ద్వారా 14,01,043 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. దీని విలువ రూ.77,23,962 ఉంటుందన్నారు. జిల్లాలో నాలుగు గంజాయి కేసులు నమోదు కాగా, 11 మందిని అరెస్టు చేశామని, రూ.5.50 లక్షలు విలువైన 105 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో అక్రమంగా నగదు, బంగారు, వెండి తరలిస్తున్న వారిపై 255 కేసులు నమోదు చేసి రూ.1,24,93,282 నగదు, 17,904 కిలోల బంగారు, 41.925 కిలోల వెండి ఆభరణాలు సీజ్ చేశామన్నారు. గ్యాంబ్లింగ్, మట్కా, ద్వారా రూ.52,69,905 నగదు సీజ్ చేశామని, జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో లైసెన్సుడు ఆయుధాలు 725 ఉన్నాయని, వీటితో పాటు భద్రతకు ఉపయోగిస్తున్న వాటితో కలిసి 774 ఉన్నాయన్నారు. 670 ఆయుధాలను డిపాజిట్ చేశారని, ఇంకా బ్యాంకులు, ఇతర సంస్థల వద్ద 96 ఆయుధాలు ఉన్నాయన్నారు. నేరాలకు పాల్పడే వారిని బైండోవర్ చేశామని, 110 సీఆర్‌పీ కింద 967 కేసులు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు.


లక్కిరెడ్డిపల్లె: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జైభీం పార్టీ నేతలు


బెస్తపల్లిలో కేకు కట్ చేస్తున్న దళిత నేతలు, తానా మాజీ అధ్యక్షుడు


నందలూరు: అన్నదానం చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు


వీరబల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్ఐ చంద్రమోహన్

బడుగు వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

వాడవాడలా ఘనంగా నివాళులర్పించిన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 14: బడుగ బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జై భీం పార్టీ రాష్ట్ర కన్వీనర్ అంజనేయులు, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకుడు విజయభాస్కర్, ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, రామాంజనేయులు అన్నారు.. ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో వివిద కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి మూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల్లో అసమానతలను పోగొట్టిన మహనీయుడని కొనియాడారు. డాక్టర్ యలంకూరి భరత్ కుమార్, రవి ఆచారి, ఆపస్ నాయకులు బాలరాజు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరామరాజు, బీజేపీ నాయకులు కృష్ణ, జయచంద్రనాయుడు, సూరి, జయచంద్రనాయుడు, ఎంపీటీసీ సభ్యులు జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మినారాయణ, నేతలు రాజారెడ్డి, నాగిరెడ్డి, బసయ్య, అశోక్, రమణ, బాషా తదితరులు పాల్గొన్నారు

సిద్దవటం: భాకరాపేట పోలీసు బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంటు పి.ఎన్.డి.ప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అంటరానితనం, కులనిర్మూలనకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఎస్, ఆర్ఎస్ఐఎస్, ఏఆర్ఎస్ఐఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: పట్టణంలో సీపీఎం, సీపీఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, రవికుమార్, చంద్రశేఖర్, సర్వేపల్లి నరసింహ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పెనగలూరు : కోమంతరాజపురం మాజీ సర్పంచ్, టీడీపీ దళిత సీనియర్ నాయకుడు కొరముట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన మం డలంలోని బెస్తపల్లి మూడు రోడ్ల కూడలిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు దళిత సంఘాలు, కార్మిక సంఘాలు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించాయి. తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, పారిశ్రామిక వేత్త పేరం కృష్ణయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వేమన సతీష్ మాట్లాడుతూ బెస్తపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం శిథిలావస్థకు చేరుకుంటుండడంతో, మరో విగ్రహం ఏర్పాటుకు ఆర్థిక సాయం అందజేశామని తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎర్రంశెట్టి హరిరాయల్, జనసేన నాయకులు గొబ్బూరి హరిరాయల్, నరసింహులు నాయుడు, జనసేన కార్యదర్శులు ఈశ్వరయ్య, మోహన్, చలపతి, టీడీపీ రాష్ట్ర నాయకుడు సి.ధనుంజయనాయుడు, పెనగలూరు మండల టీడీపీ నాయకులు రమణయ్య, కె.కళాచంద్ర, పార్లమెంటు మహిళా కార్యదర్శి వాణి, బీజేపీ మండల మాజీ అధ్యక్షులు మన్నెం మల్లికార్జున, దళిత నాయకులు మల్లికార్జున, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. పెనగలూరులో ఎస్సీ బాయ్స్ హాస్టల్ వార్డెన్, విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కంబాలకుంట హరిజనవాడలో లింగం నరేష్ ఆధ్వర్యంలో ర్యాలీగా పెనగలూరుకు వచ్చి ఘనంగా నివాళులర్పించారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో బస్టాండు కూడలిలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అర్మగం విశ్వనాధ్, అన్నం నాగేంద్ర, సింగిల్‌విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు మోడపోతుల రాము, మండల కో-ఆప్షన్ సభ్యులు కలీం, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, మైనారిటీ నాయకులు మున్వర్‌బాషా, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు పెనుబాల నాగ సుబ్బయ్య, కాకి చంద్రమోహన్, సోమిశెట్టి ప్రభాకర్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి హిమగిరినాధ్ యాదవ్, గుణ యాదవ్, ఎముక దుర్గయ్య, నాయనపల్లి ఆదినారాయణ, తుమ్మాది శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వీరబల్లి: మండల కేంద్రంలోని గుర్రప్పగారిపల్లె క్రాస్ వద్ద ఎస్ఐ చంద్రమోహన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దళిత నాయకులు మద్దెల వెంకట్రమణ, సౌరువు రాము, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళిత నాయకులు, జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులర్పించారు బాలిరెడ్డిపల్లెలో ఎన్‌డీఏ అభ్యర్థి శ్రీధర్ నివాళులర్పించి ఆశయాలు సాధన కోసం పనిచేస్తామని తెలిపారు. ఏపీఎండీసీ ప్రాంగణంలో సీపీవో సుదర్శన్‌రెడ్డితో పాటు ఏఐటీయూసీ కార్మికుల సంఘం నాయకులు పోకూరి మురళి, కార్మికులు నివాళులర్పించారు.

రైల్వేకోడూరు :రైల్వేకోడూరులో అంబేడ్కర్ విగ్రహానికి దళిత నేత మద్దెల వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం 1000 మంది పేదలకు అన్నదానం చేశారు. సామాజిక సేవా కార్యకర్త మందపాటి శంకరయ్య, నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన దళితులు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, ముక్కా సాయి వికాస్‌రెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన నేతలు పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, జోగినేని మణి, జనసేన మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు వెంబడి రాధాకృష్ణ, లగడపాటి చెంగయ్య నివాళులర్పించారు. స్థానిక రుక్మిణి కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి మాదిగ సామాజిక వర్గ నాయకులు సమావేశం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శివరాముడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల జయంతి ఘనంగా నిర్వహించారు. దళిత యువ నాయ కుడు పలిగల రాజశేఖర్ ఆధ్వర్యంలో రైల్వే కోడూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. నినాదాలు చేశారు ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. ఉర్లగట్టుపోడు, రైల్వేకోడూరు తదితర ప్రాంతాల దళిత యువకులు పాల్గొన్నారు.


రాజంపేట: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నేతలు


రైల్వేకోడూరు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మద్దెల వెంకటసుబ్బయ్య


ఓబులవారిపల్లె: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అభిమానులు

అన్ని రంగాల్లో అధోగతిలో రాష్ట్రం


వడ్డెరల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లీగల్ అడ్వైజర్ టీ. ఈశ్వర్

రాయచోటిటౌన్, ఏప్రిల్14: అన్ని రంగాల్లో అభివృద్ధి కుంటుపడి అధోగతి పాలైన రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి కులంపైన, మతంపైన ఉందని ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక లీగల్ అడ్వైజర్ టీ. ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని అజయ్ కల్యాణ మండపంలో ఆదివారం విద్యావతుల వేదిక నాయకుడు జీవానందం అధ్యక్షతన రాయచోటి నియోజకవర్గ స్థాయి వడ్డెర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాడన్నారు. ఐదేళ్ల వ్యవధిలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు, చెరువులు, గుట్టలు, కొండలు కబ్జాలకు గురయ్యాయన్నారు. రాష్ట్రంలో దౌర్జన్యకాండ కొనసాగుతోందని, జగన్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నామరూపాలు లేకుండా పోతుందన్నారు. రాష్ట్రంలో ఏ కుటుంబానికి భద్రత ఉండదని, ఇలాంటి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన వడ్డెరలకు ఐదు లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా ఉండేదని, దీనిని జగన్ ప్రభుత్వం రద్దు చేసి అన్యాయం చేసిందన్నారు. శ్రమచేసే కులాల్లో వడ్డెర కులం అగ్రభాగాన ఉంటుందని, వడ్డెర కులం లేనిదే దేశ నిర్మాణమే జరగదని, అలాంటి కులాన్ని నిర్లక్ష్యం చేయడం రాజకీయ పార్టీలకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్ రెడ్డి రమణయ్య, న్యాయవాదులు నాగముని, నాగార్జున, ఏఐఎస్ఎఫ్ కోటేశ్వరరావు, సురేంద్ర, బీజేపీ యువ మోర్చా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, వడ్డెర విద్యావంతుల వేదిక చంద్రశేఖర్, మారుతీశంకర్, కుంచపు రెడ్డెయ్య, చల్లా రెడ్డెయ్య, బండల శ్రీను, రామకృష్ణ, కోటకొండ రవిశంకర్, వార్డు మెంబర్ రఘునాథ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్డీఏ కూటమి విజయం తథ్యం'

సుండుపల్లె, ఏప్రిల్14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఏపీలో అఖండ విజయాన్ని నమోదు చేస్తుందని రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీశ్ తెలిపారు. ఆదివారం సుండుపల్లె సమీపంలోని అగ్రహారంలో ప్రచార రథం ప్రారంభించారు. బీజేపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు కోసం ఊరువాడ ప్రచారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాజు, మండల అధ్యక్షుడు నాగరాజు, మహిళా నేత అరుణ, ఉపాధ్యక్షుడు రెడ్డెయ్యఆచారి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, గోపాల్‌రాజు, సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు


31 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 14: మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 31 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 25 మందికి పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి ఛైర్మెన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆపరేషన్లకు అర్హులను ఎంపిక చేస్తున్న వైద్యులు

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన జనసేన నేత శివప్రసాద్

కడప, ఏప్రిల్ 14 : జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తిరుపతికి వచ్చిన సందర్భంగా శనివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు జనసేన సీనియర్ నేత చెంగారి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీని, అభివృద్ధి చేయమని ఆయన దిశా నిర్దేశం చేశారన్నారు. ముఖ్యంగా రాజంపేట నియోజక వర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారన్నారు. ఎన్డీయే కూటమి విజయంతో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందని ఆయన చెప్పినట్లు తెలియజేశారు.


పవన్‌కళ్యాణ్‌తో చెంగారి శివప్రసాద్

మంచి సమాజ స్థాపన అందరి లక్ష్యం కావాలి

చిట్వేలి, ఏప్రిల్ 14 : విలువలను కాపాడుకుంటూ మంచి సమాజ స్థాపన లక్ష్యంగా చేసుకొని మానవత సంస్థను విస్తరింపచేయాలని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్. రామచంద్రరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక సాయి వికాస్ పాఠశాలలో ఆకేపాటి వెంకటరెడ్డి ఇచ్చిన శాంతి రథాన్ని ఆవిష్కరించారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించా రు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సాయిరాం, కార్యదర్శి మునిరావు, కడప కేంద్ర కమిటీ సభ్యుడు రంజుల రెడ్డి, సుబ్బరాయుడు, రెడ్డన్న, రాటాల గోపి, వీరరెడ్డి, మానవతా గౌరవ డైరెక్టర్, చిట్వేలి శాఖ ఉమామహేశ్వర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, వీరాంజనేయ రాజు, తిరుమల విశ్వనాథం, శ్రీనివాసులు, రంగారెడ్డి, మానవతా సభ్యులు దాతలు తదితరులు పాల్గొన్నారు.



శాంతిరథం ప్రారంభిస్తున్న వెంకటరెడ్డి

ఘనంగా మారుతి హాస్పిటల్ వార్షికోత్సవం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 14: తిరుపతి లీలామహల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న శ్రీమారుతి హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జగదీష్, ప్రొఫెసర్ గణపతిభట్, మారుతి హాస్పిటల్ ఛైర్మన్ రామకృష్ణనాయుడు జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ గుండెకు సంబంధించి మేజర్ ఆపరేషన్లకు చెన్నై, హైదరాబాదు వంటి మహానగరాలకు వెళ్లే అవసరం లేకుండా తిరుపతిలోనే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థోకు సంబంధించి ఏడాదిలో 100కు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన ఏకైక హాస్పిటల్‌గా మారుతి నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హాస్పిటల్ సిబ్బందికి జ్ఞాపిక బహూకరించారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జగదీష్

టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన చిన్నకుడాల నాయకులతో బీటెక్ రవి

సీకేదిన్నె, ఏప్రిల్ 14:నారా చంద్రబాబునాయుడితోనే సంక్షేమం, అభివృద్ధి ఆధారపడి ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇందిరానగర్‌లో ఆదివారం వైసీపీ నుండి వంద కుటుంబాలవారు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, పుత్తా నరసింహారెడ్డి అల్లుడు యశ్వంత్‌రెడ్డి, సాయినరసింహారెడ్డి, టి.వి.కృష్ణారెడ్డి, గంథం మోహన్‌బాబు, ఏటూరు రామచంద్రారెడ్డి, శివశంకర్, మోహన్, గంగిరెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల టౌన్: లిం గాల మండలంలో టీడీపీ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆదివారం మండలంలోని చిన్నకుడాల గ్రామానికి చెందిన ఎనిమిది కుటుంబాలవారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో లింగాల టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, గంగిరెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్న వారికి బీటెక్ రవి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శశికిరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, రామేశ్వరరెడ్డి, పవన్‌కుమార్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జనసేన అభ్యర్థి ప్రచారం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 14 : మండలంలోని బాలిరెడిపల్లె, శివాజీ నగర్‌లో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ప్రచారం నిర్వహించారు. ముక్కా సాయి వికాస్ రెడ్డి, జనసేన పార్టీ నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, పి.వాసు దేవరెడ్డి, కె.చలపతి, గజ్జెల రమణ రెడ్డి, బీజేపీ రామ సుబ్బారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ప్రేమ్, అనిత దీప్తి, వేణుగోపాల్‌రెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి, నాయుడోరి రమణయ్య, వై.కోట నాగరాజు, వై.కోట ధన తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

రామాపురం, ఏప్రిల్ 14: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీలోని మూలపల్లి, యానాదికాలనీ, గోపగుడిపల్లె పంచాయతీలోని నాగరాజుపల్లి, గొల్లపల్లి, గాజులపేట, కాంపల్లె, హరిజన వాడ, మాలపల్లి, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని కొత్త రోడ్డునారాయణపురం, కొత్తపల్లి, శంకరాపురం, సూర్యనారాయణపురం, వడ్డెపల్లె, సుగాలిబిడికి, పాత మేదరపల్లెల్లో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీ ప్రచార రథంపై దాడి హేయం

సంబేపల్లె, ఏప్రిల్ 14: టీడీపీ ప్రచార రథంపై దాడి హేయమైన చర్య అని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి అశోక్‌చౌదరి అన్నారు. వైసీపీ గూండాయిజానికి ఇది పరాకాష్ట అని తెలిపారు. వైసీపీ అవినీతి అరాచక పాలనకు కాలం చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎన్ఆర్ఐ టీడీపీ మాజీ అధ్యక్షులు గుది నాగార్జుననాయుడు, శంకర, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో షర్మిల 'న్యాయ యాత్ర'

పీలేరు, ఏప్రిల్ 14: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన 'న్యాయ యాత్ర'లో భాగంగా 16న పీలేరులో పర్యటించనున్నారని పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాలిరెడ్డి సోమశేఖరరెడ్డి తెలిపారు. పీలేరులో ఆదివారం ఆయ న విలేఖరులతో మాట్లాడారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక నాలు గు రోడ్ల కూడలిలో ఆమె ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ యాత్రను విజయవంతం చేయాలని గుర్రంకొండ పార్టీ అధ్యక్షుడు సమీరుద్దీన్ తెలిపారు. ఈనెల 16 పీలేరులో న్యాయ యాత్ర ప్రారంభమై కలికిరి, వాల్మీకిపురం మీదుగా మదనపల్లెకు చేరుకొంటారని తెలిపారు.

రైతులు, నిరుద్యోగులను విస్మరించారు

● రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

సుండుపల్లె, ఏప్రిల్14: రైతులు, నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గోపాలకృష్ణపురం, ఆరోగ్యపురం, బంగ్లా హరిజనవాడ, శివరాంపురం, తిమ్మారెడ్డిగారిపల్లె, ముడుంపాడు, పింఛా తదితర గ్రామాల్లో తిరిగి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనతరం సుండుపల్లెలోని సాయన్నగారిపల్లె రామాపురంలోని ఆలయంలో టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. రైతులు, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వంలో తీరని నష్టం జరిగిందన్నారు. సాగునీరు లేక రైతులు అష్టకష్టాలు పడుతుంటే , కనీసం పంట నష్టపరిహారాన్ని సైతం ప్రభుత్వం అందించలేదన్నారు. బేరిపల్లెకు చేరిన రూపేశ్ ఆధ్వర్యంలో షరీఫ్, ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, ప్రసాద్, నరసింహా, భరత్, కిశోర్, నాగేంద్రతో పాటు సుమారు 50 మంది యువకులు తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు శివకుమార్‌నాయుడు, మండల మాజీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి శివారెడ్డి, శివరామ్‌నాయుడు, దామోదర్‌నాయుడు, సురేశ్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్‌రాజు, చిన్నసిద్దు, మాజీ ఎంపీటీసీ రమణయ్య, ఎల్వీ రమణ, చంద్రశేఖర్‌రాజు, బేరిపల్లి శ్రీధర్, యర్రంరెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు వెంకట్రామ రాజు, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామాశ్రీనివాస్, పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో సుగవాసి ప్రసాద్‌బాబు

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి


రాజంపేట: అగ్నిప్రమాదాల నివారణ పరికరాల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో మోహన్‌రావు


లక్కిరెడ్డిపల్లె: అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఐ విష్ణువర్ధన్

రాజంపేట టౌన్, ఏప్రిల్ 14: రాజంపేట అగ్నిమాపక కేంద్ర ఆవరణంలో ఆదివారం ఆర్డీవో టి.మోహన్‌రావు అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతమైన చర్యలు ప్రశంసనీయమన్నారు. అగ్నిమాపక అధికారి మాబూసుభాన్ మాట్లాడుతూ ఈ అగ్నిమాపక వారోత్సవాలు వారం రోజుల పాటు జరుగుతాయని, పెట్రోలు, బంకులు, పాఠశాలలు, అపార్టుమెంటులు పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

లక్కిరెడ్డిపల్లె: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ విష్ణువర్ధన్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఫైర్‌స్టేషన్ లో అవగాహన సదస్సు ఏర్పాటుచేసి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫైర్‌ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాలు పెట్రోల్ బంకులు, పాఠశాలలు, జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైన అగ్నిప్రమాదాలు జరిగితే 08567-234199 నెంబరుకు ఫోన్ చేస్తే వెంటనే వచ్చి మంటలను అదుపుచేస్తావన్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పపాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ

రైల్వేకోడూరు, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బందికి ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌పై ఎన్నికల అధికారి లీలారాణి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌లో ఏ విధంగా ఓటు వేయాలి అనే అంశంపై ప్రధానంగా వివరించామన్నారు. ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివరాముడు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు సిద్దేశ్వరరావు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో వీరబల్లి కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

● ప్రథమ సంవత్సర ఫలితాల్లో జిల్లాలో ప్రథమస్థానం

వీరబల్లి, ఏప్రిల్14: ఇంటర్ ఫలితాల్లో అన్నమయ్య జిల్లాలోని 22 కేజీబీవీల్లో వీరబల్లి కేజీబీవీ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించడంతో ఆ పాఠశాల జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. కలకడ కేజీబీవీ 96 శాతం సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వీరబల్లి, సంబేపల్లె, పెద్దమండెం, చిన్నమండెం, మొలకలచెరువు కేజీబీవీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో వీరబల్లి కేజీబీవీ కళాశాల బైపీసీ విద్యార్థిని దీపిక 953 మార్కులు సాధించి కేజీబీవీల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. వందశాతం సాధించిన విద్యార్థినులను కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను, జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, జీసీడీవో రాధమ్మ ఆదివారం అభినందించారు. వీరబల్లి కళాశాల ప్రిన్సిపాల్ సాయిదివ్యను ప్రత్యేకంగా అభినందించి విద్యార్థిని దీపికకు శుభాకాంక్షలు తెలిపారు. కేజీబీవీలో నాణ్యమైన విద్య ఉందని ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధించారని జీసీడీవో రాధమ్మ అన్నారు. వీరల్లిలో అత్యధిక మార్కులు సాధించిన దీపికను, ప్రిన్సిపాల్ సాయిదివ్యను ఆమె శుక్రవారం కేజీబీవీలో ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా 10వ తరగతి చదివిన విద్యార్థినులు తప్పక చేర్పించాలని ఆమె కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 14: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసి న ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. చేనేత కార్మిక సంఘం ఏపీ వారి ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉమాదేవి మెటర్నటీ అండ్ జనరల్ హాస్పిటల్ మదనపల్లె వారిచే డాక్టర్ సి రమాదేవి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఆర్వీ దినేష్‌కుమార్ లు ఉచిత వైద్యశిబిరంలో 200మంది చేనేత కార్మిక కుటుంబసభ్యులకు ఆరోగ్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేశారు.

పుంగనూరు ప్రజల గొంతుకనవుతా

గత ఎన్నికల్లో అప్పటికి పెద్దగా బలం లేని పార్టీ తరపున పోటీచేసి స్వల్ప వ్యవధిలోనే బలమైన ప్రత్యర్థిని ఢీకొని 16 వేల ఓట్లు సాధించి సంచలనం సృష్టించిన నేత ఆయన. ఓటమికి వెరవక.. అధికార బలం తోడైన అదే ప్రత్యర్థికి ఐదేళ్లుగా సవాలు విసురుతున్న నాయకుడాయన. పోలీసులతో అడుగడుగునా అడ్డుకుంటున్నా లెక్క చేయక నియోజకవర్గ ప్రజలకు సాయం చేసేందుకు నిరంతరం యత్నించిన సాహసికుడాయన. పార్టీలు, ప్రభుత్వాల సాయం లేకున్నా వ్యక్తిగత ధనంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న సామాజిక సేవకుడాయన. పుంగనూరు నియోజకవర్గంలో వేళ్లూనుకపోయిన రౌడీయిజాన్ని కూకటివేళ్లతో పెకలించి ప్రశాంత వాతావరణం తెస్తానని ధీమా వ్యక్తం చేస్తున్న భారత చైతన్య యువజన పార్టీ అధినేత, ఆ పార్టీ అభ్యర్థి బోడె రామచంద్ర యాదవ్ తన అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

\- పుంగనూరు

రౌడీయిజం అణచివేతే ఎన్నికల నినాదం

పుంగనూరు నియోజకవర్గంలో రౌడీయిజం అణచివేతే ఈ ఎన్నికల్లో నా నినాదం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అతడి కుటుంబం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళతా. రౌడీయిజాన్ని అణచివేసి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం తీసుకు రావడం, రైతులు, యువత సమస్యలు పరిష్కరించడం, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా అభివృద్ధి పరచడం వంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా ఎంచుకుంటున్నా. ఐదేళ్లుగా అధికార పార్టీ సాగించిన దౌర్జన్యాలు, రైతులను దోపిడీ చేయడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం, ఎన్నికల్లో రౌడీయిజంతో ఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తా.



● రౌడీయిజాన్ని అణగదొక్కుతా! ● నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబరు వన్ చేస్తా
● భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్రయాదవ్



పెద్దిరెడ్డి బాధితులే నా బలం

పుంగనూరులో పదిహేనేళ్లుగా రౌడీయిజం, గూండాయిజాన్ని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెంచి పోషించారు. అధికార బలంతో ఎక్కడ చూసినా దౌర్జన్యాలు, దోపిడీలు సాగించారు. వందలాది మందిపై తప్పుడు కేసులు పెట్టించారు. రౌడీషీట్లు తెరిపించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకం సృష్టించారు. కనీసం స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వేచ్ఛగా నామినేషన్ వేసే అవకాశం కూడా లేకపోయింది. పాడి రైతులు స్వేచ్ఛగా తమకు నచ్చిన డెయిరీలకు పాలు పోసే అవకాశాన్నీ లేకుండా చేశారు. ఇలా చెప్పుకొంటూ పోతే మంత్రి పెద్దిరెడ్డి బాధితులకు అంతూపొంతూ వుండదు.వీరే నా బలం. పుంగనూరులో రౌడీయిజాన్ని అణచివేసి శాంతిభద్రతలు కాపాడడానికి వారంతా నాకు మద్దతుగా నిలుస్తారని నమ్ముతున్నా.

నాడు రాజకీయ మార్పు కోసం.. నేడు అభివృద్ధి కోసం

పుంగనూరులో రాజకీయ మార్పు కోసం 2019లో పోటీ చేశా. ఇప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి పోటీ చేస్తున్నా. గతంలో సమయం తక్కువగా ఉండటం, నేను ఎంచుకున్న పార్టీకి బలమైన క్యాడర్ లేకపోవడం వంటి కారణాలతో కేవలం 16 వేల ఓట్లే వచ్చాయి. ఇప్పుడు ఐదేళ్ళుగా ప్రజా సమస్యలపై పోరాడుతున్నా. పుంగనూరు ప్రజల గొంతుకగా మారి.. వారి వాణి వినిపిస్తున్నా. రైతులు, యువత సమస్యల గురించి పట్టించుకునే పార్టీలు, నాయకులు ఇప్పుడు లేరు. అందుకే వారి వెతలు తీర్చడం కోసమే కొత్తగా పెట్టిన పార్టీ తరపున పోటీ చేస్తున్నా.

వంద శాతం గెలుస్తా

పుంగనూరు ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఐదేళ్లుగా నేను చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తిస్తున్నారు. రౌడీయిజానికి వెరవకుండా నేను సాగిస్తున్న పోరాటాన్నీ గమనిస్తున్నారు. కరోనా కాలంలో చేపట్టిన సహాయక చర్యలతో కష్టకాలంలో అండగా ఉంటానని నమ్ముతున్నారు. వీటికితోడు అధికార పార్టీ నేతల అరాచకాలతో విసిగిపోయి ఉన్న ప్రజలు.. ఈసారి నన్ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో వందశాతం విజయం సాధిస్తా.

ఇదీ నా మ్యానిఫెస్టో

నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి 500 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులో తేవడానికి ట్రిపుల్ ఐటీ మంజూరు చేయిస్తా. ఉర్దూ బాలికల కోసం డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తా. మామిడి, చింతపండు, టమోటా ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా మార్కెట్లలో ఆయా పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తా. అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయించి వేలాది మందికి ఉపాధి దొరికేలా చూస్తా. చెరకు రైతులను ఆదుకునేందుకు చక్కెర ఫ్యాక్టరీ పెట్టిస్తా. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రత్యేక పారిశ్రామిక వాడ (జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి) ఏర్పాటుకు కృషి చేస్తా. పులిచెర్ల నుంచీ కేజీఎఫ్ వరకూ రైల్వే లైను వేయించడానికి ప్రయత్నిస్తా. హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తి చేయించడంతో పాటు ఉప కాలువల నిర్మాణంపై దృష్టి పెడతా. చౌడేపల్లె నుంచి సోమల వరకూ హంద్రీ-నీవా జలాలు తరలించి మెట్ట భూములకు సాగు నీరందించడానికి ప్రయత్నిస్తా.

ప్రతి రైతుకూ నా డబ్బుతో ఆవులు అందజేస్తా

ఎన్నికల్లో నేను విజయం సాధిస్తే ప్రభుత్వం ద్వారానే కాకుండా వ్యక్తిగతంగానూ నియోజకవర్గ ప్రజలకు సాయమందిస్తా. ప్రతి రైతుకూ పాడి యావులిస్తా. అన్ని మండల కేంద్రాల్లో డెయిరీలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందిస్తా. ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళ్ళిన యువతను తిరిగి పుంగనూరు రప్పించి ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పిస్తా. ప్రతి గృహిణీ నెలకు కనీసం రూ.15 వేలు ఆదాయం పొందేలా స్వయం ఉపాధి సాధించేందుకు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తా. అయ్యప్ప భక్తులకు ఏటా పుంగనూరు నుంచి శబరిమల వెళ్ళడానికి ఉచితంగా బస్సులు ఏర్పాటు చేస్తా. మక్కా వెళ్ళాలనుకునే ముస్లింలకు ఏటా ప్రయాణ ఖర్చులకు సాయం అందిస్తా.

పుంగనూరుకు పెద్దిరెడ్డి చేసిందేమీ లేదు

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజా బలం లేదు. ఆయనది ఆర్థిక బలం. ప్రభుత్వం ఉండటంతో అధికార బలం ప్రదర్శిస్తున్నారు. అధికారం లేకపోతే పెద్దిరెడ్డికి బలం లేదు. మూడుసార్లు పుంగనూరు ప్రజలు గెలిపించినా ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. మాదక ద్రవ్యాలతో యువతను భ్రష్టు పట్టించారు. రైతులకు, వ్యవసాయ రంగానికి ఉపయోగపడేందుకు కాకుండా సొంత ఆదాయం కోసం సాగునీటి ప్రాజెక్టులు తలపెట్టారు. వాటి ద్వారా రూ. వందల కోట్లు స్వాహా చేసేందుకు యత్నించారు. చివరికి గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో ఆ పనులన్నీ ఆగిపోయాయి. ఇవన్నీ గమనిస్తున్న పుంగనూరు ప్రజలు.. ఈ ఎన్నికల్లో వైసీపీకి సమాధి కట్టడానికి సిద్ధంగా వున్నారు.

అధికారం లేకున్నా పోరాడుతున్నా

నాకు ఎలాంటి అధికారం, పదవీ లేకపోయినా నియోజకవర్గంలో దౌర్జన్యకర పరిస్థితులపై పోరాడుతున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారు. ఎలాగోలా కొందరు వేస్తే.. అధికారులపై ఒత్తిడి తెచ్చి తిరస్కరింప చేశారు. సదుం, పులిచెర్ల, చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో నామినేషన్లు వేయడానికి వచ్చిన ప్రతిపక్ష అభ్యర్థులపై పోలీసులు, అధికారుల సమక్షంలోనే దాడులు చేసి తరిమేశారు. నామినేషన్లు వేయడానికి గోడలు దూకి వెళ్లిన మహిళా అభ్యర్థులనూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ బాధితులను చిత్తూరు ఎస్పీ, గవర్నర్ వద్దకు తీసుకెళ్లి ఫిర్యాదులు చేశా. బాధితులకు న్యాయం జరగడం కోసం హైకోర్టులో కేసులు వేశా.

యువతకు ఉద్యోగాలు రాకుండా అడ్డుపడ్డారు

పుంగనూరులో పదివేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 2022 డిసెంబరు 22న మెగా జాబ్‌మేళాకు వంద కంపెనీలను ఆహ్వానించా. సొంతస్థలంలో ఏర్పాట్లు చేశా. దానికి ముందురోజు అనుమతి లేకుండా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని వంకపెట్టి 30 పోలీస్‌యాక్టు, 144 సెక్షన్ విధించారు. జాబ్‌మేళా స్థలం వివాదంలో ఉందని, నిరుద్యోగులు హాజరుకారాదని, ఏర్పాట్లను ధ్వంసం చేశారు. గతేడాది సెప్టెంబరు 3వ తేదీన విజయవాడలో బీసీవై పార్టీ తరపున మెగా జాబ్‌మేళా నిర్వహిస్తే 80 వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 560 కంపెనీల ద్వారా 32 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించా.

రోడ్డుపై అడ్డుకుంటే హెలికాప్టర్‌లో పర్యటించా

మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ కంపెనీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె, కురబలకోట మండలం ముదివేడు వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించారు. ఈ ప్రాజెక్టులను సందర్శించి అవకతవకలను ప్రజలకు వివరించాలని బయల్దేరితే పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టారు. దీంతో హెలికాప్టర్‌లో మూడు ప్రాజెక్టులను సందర్శించా. జిల్లాలో మంత్రి దౌర్జన్యాలకు ఇంతకు మించిన నిదర్శనం ఏముంటుంది?

కేంద్రం నుంచి రక్షణ పొందా

2022 డిసెంబరు 4వ తేదీ మంత్రి అనుచరులు 300 మంది నా ఇంటిపై దాడి చేశారు. నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా ఉన్నవారిపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా, వారి ఆస్తులు ధ్వంసం చేస్తున్నా పోలీసు యంత్రాంగం ఎలాంటి రక్షణ కల్పించలేదు. వీటిపై కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేయడంతో నాకు వై ప్లస్ భద్రత కల్పించారు.

మంత్రి, ముఖ్యమంత్రుల అవినీతిపైనే ఫిర్యాదు చేశా

మంత్రి పెద్దిరెడ్డి అవినీతిపై పోరాడుతున్నా. రూ.35 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశా. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారంటూ పులివెందుల పోలీస్‌స్టేషన్లోనే ఫిర్యాదు చేశా. నాపై ఇప్పటి దాకా పోలీసులు 47 కేసులు నమోదు చేశారు. అయినా భయపడే ప్రసక్తే లేదు. పుంగనూరులో అరాచక శక్తులను తరిమికొట్టే వరకూ నా పోరాటం కొనసాగుతుంది.

రైతుల రక్తం తాగుతున్నారు

సదుం మండలంలో మంత్రికి చెందిన డెయిరీ.. మిగిలిన ప్రైవేటు డెయిరీలకంటే కూడా చాలా తక్కువగా పాడి రైతులకు ధర ఇస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలు, దాడులు జరుగుతున్నాయి. బయటి డెయిరీలు రాకుండా పాలవ్యాన్లపై దాడులు చేయడం, పాలక్యాన్లు గ్రామాల్లో తీసుకోకుండా దౌర్జన్యాలు చేస్తున్నారు. నష్టాలు భరించలేక చాలా మంది రైతులు పాడియావులను తెగనమ్మేసుకుంటున్నారు. పాడి రైతుల రక్తం తాగుతున్న అధికార పార్టీ నేతలకు తగిన బుద్ధి చెప్పి, పాడి రైతుల దోపిడీని ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసేందుకు 2022 నుంచి రైతుభేరి బహిరంగ సభ నిర్వహణకు మూడుసార్లు ప్రయత్నించినా అడ్డుపడ్డారు. హైకోర్టు అనుమతించినా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు 30 యాక్టు, 144 సెక్షన్ విధించి ఇంటి నుంచి బయటకు రానివ్వలేదు. చివరకు హైకోర్టు ఆదేశాలతో పుంగనూరులోని నా మామిడితోటలో రైతుభేరి సభ నిర్వహించా.

ఘనంగా మారుతి హాస్పిటల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జగదీష్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 14: తిరుపతి లీలామహల్ సెంటర్, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా మినర్వా గ్రాండ్ హోటల్ పక్కన ఉన్న శ్రీమారుతి హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ జగదీష్, ప్రొఫెసర్ గణపతిభట్, మారుతి హాస్పిటల్ చైర్మన్ రామకృష్ణనాయుడు జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ మారుతీకృష్ణ మాట్లాడుతూ గుండెకు సంబంధించి మేజర్ ఆపరేషన్లకు చెన్నై, హైదరాబాదు వంటి మహానగరాలకు వెళ్లే అవసరం లేకుండా తిరుపతిలోనే అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్థోకు సంబంధించి ఏడాదిలో 100కు పైగా మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు చేసిన ఏకైక హాస్పిటల్‌గా మారుతి నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హాస్పిటల్ సిబ్బందికి జ్ఞాపిక బహూకరించారు.

ఎస్ఐ జీపు డ్రైవర్ ఆత్మహత్య



సందీప్ (ఫైల్ ఫొటో)

కార్వేటినగరం, ఏప్రిల్ 14: కార్వేటినగరం ఎస్ఐ వద్ద తాత్కాలికంగా పనిచేస్తున్న జీపు డ్రైవర్ సందీప్(27) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ వెంకటకృష్ణ కథనం మేరకు... పాదిరికుప్పానికి చెందిన ఇతడు కొబ్బరిబోండాలు విక్రయించి జీవనం సాగించే వాడన్నారు. వారం కిందటే తన వద్ద తాత్కాలికంగా జీపు డ్రైవర్‌గా చేరాడన్నారు. ఇతడు ఇంటికి రాలేదని సందీప్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా, పద్మసరస్సు వద్ద మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోను చార్జింగ్ పెడుతుండగా..



హిమాచల మండడి (ఫైల్ ఫొటో)

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 14: గానుగ షెడ్ వద్ద సెల్‌ఫోను చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎస్ఆర్‌పురం మండలం ఎస్ఆర్‌పురం గ్రామానికి చెందిన హిమాచల మండడి(37) ఆదివారం మృతిచెందారు. ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కుళాయప్ప తెలిపారు.

కాణిపాకంలో ఘనంగా తమిళ నూతన సంవత్సరాది



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14: కాణిపాక వినాయకస్వామి ఆలయంలో ఆదివారం తమిళ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాణిపాకానికి చెందిన దివంగత రాజమాణిక్యం కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను పుర వీధుల్లో ఊరేగించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్, భక్తులు పాల్గొన్నారు.


ఎన్నికల్లో బలిజల సత్తాచాటాలి

టీడీపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి ● ఆత్మీయ సమావేశంలో వంగవీటి రాధా పిలుపు



టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: రానున్న ఎన్నికల్లో బలిజల సత్తా చాటి.. సంఖ్యాబలం చూపాలని రాష్ట్ర కాపుసంఘం నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. చిత్తూరులోని ఆర్ఎల్ నాయుడు కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజలకు వైసీపీ సరైన గుర్తింపు ఇవ్వలేదని.. బలిజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేసింది శూన్యమని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడానికే కులాల వారీగా కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి కనీసం రూపాయి కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు. వైసీపీలో కేవలం సీఎం జగన్ సామాజిక వర్గానికే గుర్తింపు ఉందన్నారు. టీడీపీ కూటమితోనే కాపు సామాజిక వర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరు లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తమను గెలిపిస్తే నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని దగ్గుమళ్ల ప్రసాదరావు, గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. రోడ్లు, డ్రైనేజి, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు కల్పించడానికి కృషిచేస్తామన్నారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి తమను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం టీడీపీ, వైసీపీ పాలనలో జరిగిన చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని పోల్చుతూ ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, బలిజ సంఘం నేత లు డీకే బద్రినారాయణ, ఓఎం రామదాసు, కాజూరు బాలాజి, రామ్మూర్తి,వినాయక బాలాజి, కాజూరు రాజేష్, ఆర్ఎస్ఎల్ఎస్ సుబ్బా, గుర్రప్పనాయుడు, కిషోర్, గోపి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా సమావేశానికి..

వంగవీటి రాధాకు బలిజ సేవా సమితి నేతలు, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా స్వాగతం పలికారు. తొలుత నాగయ్య కళాక్షేత్రంలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూల మాలవేశారు. అక్కడ్నుంచి గాంధీ సర్కిల్, ఆర్టీసీ బస్టాండు, కొంగారెడ్డిపల్లె మీదుగా ఎస్టేట్‌లోని ఆర్ఎల్ నాయుడు కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వంగవీటి రాధాతో కరచాలనం చేయడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి యువత ఆసక్తి చూపారు. కాగా, చిత్తూరులోని మాజీ మేయర్ కటారి హేమలత నివాసానికి స్థానిక నేతలతో కలిసి వంగవీటి రాధా వెళ్లారు. ఆమె కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు.

విద్యారంగాన్ని బలోపేతంచేసే వారికే మద్దతు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 14: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే వారికే ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. చిత్తూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సీపీఎస్, జీవో 117 రద్దు, పాఠశాలల విలీనం నిలుపుదల, నెలనెలా జీతం చెల్లించి, విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించే పార్టీకే యూటీఎఫ్ మద్దతు ఇస్తోందన్నారు. గడచిన విద్యా సంవత్సరం బోధన పని కంటే బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులకు ఎక్కువైన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహానాబేగం, రఘుపతి, దీనావతి, ప్రకాష్, దక్షిణామూర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సురేంద్రకుమార్



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా చిత్తూరుకు చెందిన సురేంద్రకుమార్ నియమితులయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అనేక పదవుల్లో ఆయన పని చేశారు.

రూ.1.04 లక్షల నగదు పట్టివేత

గుడిపాల, ఏప్రిల్ 14: గుడిపాల మండలం గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద ఆదివారం సరైన రశీదులు లేని రూ.1,04,400ను ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి, పోలీసులు సీజ్ చేశారు. రాణిపేట నుంచి బంగారుపాళ్యానికి వెళ్తున్న వాహనంలో ఈ నగదును పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్రీహరి, మునిరత్నం, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో కొనసాగుతున్న రద్దీ



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 14: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో ఆదివారం భక్తులరద్దీ కొనసాగుతోంది.స్వామిదర్శనార్థం వందలాదిగా భక్తులు జిల్లా నలుమూలలనుంచి విచ్చేయడంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగానిండిపోయాయి.

రూ.4.7కోట్ల బంగారం, 27 లక్షల వెండి పట్టివేత

చిల్లకూరు, ఏప్రిల్ 14: బిల్లుల్లేకుండా తరలిస్తున్న బంగారం, వెండి ఆభరణాలను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద వున్న చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరు నుంచి మదనపల్లెకు తరలిస్తున్న జీఆర్‌టీ జ్యువెలరీకిచెందిన బంగారం,వెండిని పరిశీలించామన్నారు. ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో రూ.4,79,16,247 విలువచేసే 6,986 గ్రాముల బంగారం, రూ. 27,91,879 విలువ చేసే 23,688 గ్రాముల వెండిని సీజ్ చేసి ఆదాయపన్నుశాఖకు అప్పగించామన్నారు.



తంబళ్లపల్లె అభివృద్ధిపై కక్ష కట్టి..

ముప్పై ఏళ్లు వెనక్కి నెట్టారు

- పాలకుల తప్పిదాల వల్లే తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడింది
- రైతు కుటుంబంలో పుట్టాను.. రైతులు తలెత్తుకుని జీవించేలా చేయడమే ప్రథమ లక్ష్యం
- బీడు భూములను సాగులోకి తెచ్చి కరువు పీడిత ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా
- హంద్రీ - నీవా జలాలతో ప్రతి చెరువు, కుంటను నింపడమే ధ్యేయం
- పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య లేకుండా చేసి వలసలు నివారిస్తాను
- ఒక్క అవకాశమివ్వండి.. నా ఇంజనీరు పరిజ్ఞానంతో అభివృద్ధిపై చెరగని ముద్ర వేస్తా
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 14: తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధిపై కక్ష కట్టి...ముప్పై ఏళ్ల వెనక్కి నెట్టారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గాలికి వదిలేసి, అరాచకాలు, అక్రమాలు, దౌర్జన్యాలను పెంచి పోషించిందని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. పాలకుల తప్పిదాల వల్ల తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. రైతు కుటుంబంలో పుట్టాను. రైతుల సమస్యలు బాగా తెలిసిన వాడిని. రైతులు తలెత్తుకుని జీవించేలా చేయడమే నా ప్రధమ లక్ష్యం. బీడు భూములను సాగుతోకి తెచ్చి కరువు పీడిత ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా. హంద్రీ - నీవా జలాలతో ప్రతి చెరువు, కుంటను నింపుతా. పారిశ్రామికవాడలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య లేకుండా చేసి వలసలు నివారించేలా పనిచేస్తా. ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజవర్గ అభివృద్ధిపై చెరగని ముద్ర వేస్తా. నా ఇంజనీరు పరిజ్ఞానంతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి అభివృద్ధి పథంలో నడిపిస్తా. తంబళ్లపల్లె అభివృద్ధి పనుల గురించి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన తెలియజేశారు.

? రాజకీయాలల్లోకి ఎందుకు రావాలనిపించింది

జ. నేను పుట్టిన ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచాలంటే రాజకీయాలే వేదికని అనిపించింది. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు కావస్తున్నా నా ప్రాంతం ఇంకా వెనుకబడే ఉంది. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచాలంటే ఒక్క అవకాశం కావాలని, అది రాజకీయాల వల్లే సాధ్యమనిపించి ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చా.

? రాజకీయాల్లో ఆదర్శం ఎవరు

జ. మాజీ ప్రధాని దేవేగౌడ, మాజీ ఎమ్మెల్సీ ఏవీ ఉమాశంకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి నాకు ఆదర్శం. వీళ్లలో దేవేగౌడ, ఏవీ ఉమాశంకర్‌రెడ్డిలు సివిల్ ఇంజనీర్లుగా పట్టభద్రులై ప్రజలకు ఎంతో సేవచేయాలన్న ఆశయంతో పని చేసి కీర్తిని తీసుకొచ్చారు.వారందరి నాయకత్వ పటిమతో చిన్నప్పటి నుంచి నాయకత్వంపై ఆసక్తి ఉండేది. వాళ్లను ఆదర్శంగా తీసుకుని మన కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాను. నేను కూడా సివిల్ ఇంజనీర్‌నే. నా ఇంజనీరు పరిజ్ఞానంతో ప్రజలకు దగ్గరై అభివృద్ధి ఎలా చేయాలో అవగాహన ఉంది.

? నిరుద్యోగ సమస్యను ఎలా పరిష్కరిస్తారు

జ. తంబళ్లపల్లెను పారిశ్రామికంగా అభివృద్ధి పరచడానికి నా దగ్గర ప్రణాళికలు ఉన్నాయి. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. తద్వారా 200 నుంచి 250 కంపెనీలను ఇక్కడికి తీసుకొచ్చి, కంపెనీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించేలా చేస్తా. దీంతో 25 వేల నుంచి 30వేల వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను శాశ్వితంగా పరిష్కరించి, వలసలను నివారిస్తాను.

? తంబళ్లపల్లెకు వెనుకబడిన నియోజకవర్గంగా ఎందుకు పేరొచ్చిందంటారు

జ. గత పాలకుల తప్పిదాల వల్ల తంబళ్లపల్లెకు వెనుకబడిన నియోజకవర్గంగా పేరొచ్చింది. అభివృద్ధిపై పాలకులు పట్టించుకోలేదు. ఇక్కడి స్థితిగతులపై ఏ మాత్రం అవగాహన లేని నాయకుల వల్ల ఈ రోజు తంబళ్లపల్లె అభివృద్ధిలో వెనుకబడింది. వ్యవసాయ, నిరుద్యోగ సమస్యల గురించి పట్టించుకోలేదు. ప్రపంచంలో ఈ రోజుకు కూడా ఎన్నో దేశాలు ఆహారం లేక పంటలు పండిం చేందుకు వాతావరణ పరి స్థితులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాయి. 24 దేశాల్లో తిరిగిన పరిజ్ఞానం, అనుభవాలు ఉన్నాయి. ఇక్కడ మనకు అన్ని సౌకర్యాలు ఉన్నా సాగునీటి, తాగునీటి సమస్యలకు ఇంత వరకు పరిష్కారం చూపలేదు. ఇక్కడ వనరులు ఉన్నా పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల కారణంగా మన నియోజకవర్గం వెనకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది.

? వనరుల సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు

జ. వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజక వర్గంలో వనరులు దోపిడీకి గురయ్యాయి. తాగు, సాగునీటి వనరులను ధ్వంసం చేశారు. అనుమతులకు మించి ఇసుకను తోడేసి సాగునీటికి తీవ్ర నష్టాన్ని కల్గించారు. నాకు ఒక్క అవకాశమిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించండి వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి భూగర్భజలాలు పెరిగేలా కృషి చేస్తా. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుక, మైనింగ్ లేకుండా చేస్తా. సాగునీటి వసతులు ధ్వంసం కాకుండా అన్ని చర్యలు చేపడుతా.

? హంద్రీ - నీవా జలాల మాటేంటి

జ. ప్రస్తుతం మన తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండు మండలాల్లో మాత్రమే హంద్రీ-నీవా కాలువ వెళ్లింది. హంద్రీ-నీవా జలాలను ఆరు మండలాలకు విస్తరించడానికి కృషి చేస్తా. ఉప కాలువలు తీయించి ప్రతి మండలానికి హంద్రీ - నీవా జలాలు తీసుకొస్తా. హంద్రీ - నీవా జలాలతో ప్రతి చెరువును, కుంటను నింపుతాను. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని కరువు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతా.

? మీరు చేసిన సేవా కార్యక్రమాల గురించి చెప్పండి

జ.. ఐదేళ్ల కాలంలో నా దృష్టికి వచ్చిన సమస్యలు సొంత నిధులతో పరిష్కరించా. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు, ఆరోగ్య పరిస్థితులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకున్నా. దేవాలయాలు, మసీదులకు నా వంతు సాయం అందించా. చదువుకోవడం కోసం ఇబ్బంది పడుతున్న పేద విద్యార్థులను అండగా నిలిచా. కరోనాతో కుటుంబ పెద్దలను కోల్పోయి వారికి ఆర్థిక సహాయం చేశాను. పలు పాఠశాలల అభివృద్ధికి సహకరించా. యువతను ప్రోత్సహించడానికి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించా.

? రైతు కుటుంబం నుంచి వచ్చారు కదా.. రైతుల కోసం ఏం చేస్తారు

జ.. మాది రైతు కుటుంబం. నా తండ్రి నారాయణరెడ్డి వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషిం మమ్మల్ని చదివించారు. రైతులు పిల్లల చదువు కోసం, ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ఎంతటి కష్టాలు పడుతారో దగ్గరుండి చూశాను. రైతుల పడే బాధలపై పూర్తిగా అవగాహన ఉంది. బీడు భూములకు నీటి సదుపాయం కల్పించి రైతులు పండ్ల తోటలు సాగు చేసే విధంగా ప్రోత్సహిస్తాను. ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు విరివిగా ఏర్పాటు చేయించి ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఆదాయం వచ్చేలా చేయడమే నా ప్రధమ లక్ష్యం. ప్రపంచమంతా ఎంతో డిమాండ్ ఉన్న టమోటాను మన ప్రాంతంలో అత్యధికంగా పండిస్తున్నాం. తంబళ్లపల్లె నియోజకవర్గానికి టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను తీసుకొచ్చి ప్రతి నెల వెయ్యి టన్నుల టమోటాలు నిల్వ ఉంచి నాకున్న విదేశీ వ్యాపార పరిజ్ఞానంతో బయటి దేశాలకు పంపించేలా రైతులను తీర్చిదిద్దుతా. తద్వారా రైతులు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చేలా చేస్తా. ప్రస్తుతం ఎంతో చిన్న దేశమైన మలేషియా నుంచి పెద్ద ఖండమైన ఆఫ్రికా దేశానికి నెలకు వెయ్యి టన్నుల పల్ప్ ఎగుమతి అవుతోంది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మన నియోజకవర్గంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడమే నా రెండవ లక్ష్యం. వ్యవసాయ ఉత్పత్తులు, వ్యవసాయ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇక్కడ ఉత్పత్తి అయ్యే వ్యవసాయ వనరులను డిమాండ్‌కు తగ్గట్లు దేశీయ, విదేశీ మార్కెట్లకు ఎగుమతి అయ్యేలా చూడడమే నా ధ్యేయం. వీటిని అమలు చేసి రైతులు ఆత్మహత్యలు పూర్తిగా నివారించి, రైతులను తలెత్తుకుని జీవించేలా చేస్తాను.

? మీరు ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తారు

జ. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతులను రాజులు చేస్తా. నిరుద్యోగ సమస్యకు శాశ్విత పరిష్కారం చూపుతా. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను తీర్చిదిద్దుతా. అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాను. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో మరమ్మతులకు నోచుకుని రోడ్లను బాగు చేస్తా. ప్రభుత్వాస్పత్రులు ఆధునీకరిస్తాను. ప్రతి పల్లెకు ప్రభుత్వ వైద్యం అందేలా చేస్తా. ఎంతో కాలంగా ప్రజలు నిరీక్షిస్తున్న బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో, ఆర్టీసీ బస్టాండు ఏర్పాటుకు కృషి చేస్తా. బి.కొత్తకోటకు మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులు ప్రారంభమయ్యేలా చేస్తా. బి.కొత్తకోట మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి పరుస్తా. బి.కొత్తకోటలో 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను, సిబ్బందిని నియమించి పరికరాలు సమకూర్చుతా. తంబళ్లపల్లె నియోజకవర్గంకు కేంద్రంగా ఉన్న ములకలచెరువు వ్యవసాయ మార్కెట్‌లో ఆగిన అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభిస్తా. రైతులకు తక్షణం కనీస వసతులు కల్పిస్తాను. ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సీలీహిల్స్‌ను పర్యాటక పరంగా అన్ని విధాల అభవృద్ధి చేస్తా. హార్సీలీ హిల్స్ భూముల పరిరక్షణకు కృషి చేస్తా. తంబళ్లపల్లె మండలంలోని పేద్దేరు ప్రాజెక్టు, పెద్దమండ్యం మండలంలోని ప్రాజెక్టుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తా. బి.కొత్తకోట, ములకలచెరువుల్లో దుస్థితికి చేరిన షాదీమహళ్ళను అభివృద్ధి పరిచి వినియోగంలోకి తీసుకొస్తా. దీంతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తాను. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరిచి రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతా.

కోడికత్తి తరహాలో కొత్త డ్రామాకు తెరలేపిన జగన్

- ఎన్ని నాటకాలాడినా ప్రజలు ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయం
- దమ్ముంటే ఘటనపై సీబీఐ విచారణ కోరండి.. మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం
- అంగళ్లులో చంద్రబాబుపై రాళ్ళ దాడి చేసి మా వాళ్ళపై అక్రమ కేసులు పెట్టలేదా
- తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 14: కోడికత్తి తరహాలో కొత్త డ్రామాకు సీఎం జగన్ తెరలేపారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి ఓటమి ఖాయమని భావించిన జగన్ సానుభూతి కోసం కొత్త నాటకాలు అడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి దమ్ముంటే రాయి దాడి ఘటనపై సీబీఐ విచారణ కోరాలని దాంతో ప్రజలకు నిజానిజాలు తెలుస్తాయన్నారు. కోడికత్తి, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు డ్రామాలకు సీక్వల్‌గా కొత్త డ్రామా ఆడుతున్నారన్నారు. జగన్ ఎన్ని నాటకాలు అడినా ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమ న్నారు. ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు చేతులో ఉండే సీఎం జగన్ మీద దాడి జరిగితే దాన్ని కూడా రాజకీయం చేసి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. దీనిపై ఉమ్మడి చిత్తూరు జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్ధరహితంగా, హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. యువతకు మార్గదర్శమైన టీడీపీ జాతీయ ప్రధాన కార్య దర్శి యువనేత నారా లోకేష్‌పై మంత్రి పెద్దిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. పుంగనూరు, తంబళ్లపల్లె, రాజంపేట ఎంపీ స్థానాల్లో ఓడిపోతున్న విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి గ్రహించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పుంగనూరు, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉమ్మడి అభ్యర్థులు, రాజంపేట ఎంపీ స్థానంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమన్నారు. కురబలకోట మండలం అంగళ్లలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిపై వైసీపీ గుండాల చేత రాళ్ళ దాడి చేయించి చంద్రబాబుతో పాటు టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టింది ప్రజలు మర్చిపోలేదన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్దా, వైజీ సురేంద్రయాదవ్, ఆనందరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నకిష్టా, కేవీ రమణ, ముత్తుకూరు మౌళా, తులసీధర్ నాయుడు, కట్టా వెంకటరమణనాయుడు,సోమశేఖర్, ప్రతాప్‌నాయుడు, విజయ్‌కుమార్, తిరుపాల్, శ్రీనివాసులు, రసూల్, నాగరాజు, చెన్నకేశవులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి




అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీమ్‌రావ్ అంబే ద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కిరణ్‌కు మార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా మదనపల్లెకు వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబే ద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజే పీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, సీనియర్ నాయకుడు జేకే వర్మ, భగవాన్, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవి, రూరల్ అధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు. మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆర్డీవో హరిప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో ఎంఎస్ డాక్టర్ రాజు చేతుల మీదుగా రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు.

బహుజన సేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 14:మదనపల్లె లోని దిగువకమ్మపల్లెలో బహుజన సేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజనసేన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీచందు, ఆనంద్, పోర్శులలితమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కాలనీ గేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ తోపాటు బాస్ నాయకులు, బీటీ కళాశాల కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం, సీనియర్ అసోసియేషన్ నేత తిరుమలరావు, బార్ అసోసియేషన్ సభ్యుడు సోమశేఖర్, జిల్లాకన్వీనర్ ముత్యాలమోహన్, రమణఉన్నారు. కాంగ్రెస్ పార్టీ మదనపల్లె ఎమెల్యే అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి తన అనుచరులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యమాల చంద్రయ్య, గుండామనోహర్, మల్లెలమోహన్, లక్ష్మీపతి, రామచంద్ర, శ్రీరాములు, పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న ప్రజాసంఘాల నేతలు

పీలేరులో: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని ఆదివారం పీలేరు, కేవీ పల్లె మండలాల్లో ఘనంగా నిర్వహించారు. రెండు మండలాల్లోని వివిధ ప్రజా, దళిత, విద్యార్థి సం ఘాలు, రాజకీయ పార్టీల నేతలు, ప్రభు త్వ అధికారులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కేవీపల్లె మండలం కేవీపల్లెలోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భి ణులు, బాలింతలు, రోగులకు హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్, మాలమహానా డు నాయకులు పాలు, పండ్లు, మజ్జిగ వితరణగా అంద జేశారు. వేడుకల్లో పీలేరు తహసీల్దారు మహబూబ్ బాషా, అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఏపీసీపీ ఎస్‌ఈఏ, ముస్లిం జేఏసీ, ఎస్‌టీయూ, యూటీఎఫ్, భారతీయ అంబేడ్కర్ సేన, ఏపీ గిరిజన సమాఖ్య, దళిత విద్యార్థి సంఘాలు, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కలికిరిలో: అంబేడ్కర్ జయంతి వేడుకలను కలికిరిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రప టాన్ని చాందినీ బండిలో వుంచి మేళతాళాలు, డప్పులు, ఇతర వాయిద్యాల మధ్య పట్టణంలో ఊరేగించారు. మదనపల్లె డివిజన్ అంబేడ్కర్ సంఘం, కలికిరి అంబేడ్కర్ సంఘం, ఎస్సీ ఉద్యోగల సంఘం, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంసీ రమణ, రవీంద్ర, జయరామ్, రెడ్డిరాము, అగస్తి, పెద్దన్న, సిద్దయ్య, రామకృష్ణ, ఎస్టీ రమణ, గోవిందు, హరి అంబేడ్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కురబలకోటలో:మండలంలోని అంగళ్ళు టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం పక్కన దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘనేతలు కుమార్, నరసింహులు, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర టీడీపీ యువత అధ్యక్షుడు శ్రీరాంచినబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాల న్నారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జేవెంకటేష్, దొరస్వామి నాయుడు, రమణ, రాజన్న, లక్ష్మన్న, రఫి, చినబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ప్రతి పౌరుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని ఎంపీడీవో వెంకటరమణయ్య, ఎంఈవో రామకృష్ణలు పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం, పోలీసుస్టేషన్, ఎమ్మార్సీల లో పాటు రాజ్యంగకర్త అంబేడ్కర్ జయంతిని జరుపుకున్నారు. ఎస్ఐ చెన్నకేశవ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్అంబేడ్కర్ జయంతి కలకడలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మాల మహానాడు ఐక్యవేదిక, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు దామోదరం, రెడ్డికిరణ్, మల్లికార్జున, శ్రీనివాసులు, హరినాథ్, రజినీకాంత్, రాంబాబులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే దళిత సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, రమణ, చంద్రమౌళి, పీవీ నారాయణ, వల్లిగట్ల వెంకటరమణ, రమేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఇంటర్ ఫలితాల్లో జ్ఞానాంభిక విద్యార్థుల ప్రభంజనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జ్ఞానాంబిక జూనియర్ కళాశాల కరస్పాడెంట్ రాటకొండ గురుప్రసాద్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 14: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మదనపల్లెలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జ్ఞానాంబిక జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ కళశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస నజియా 470కి 463, బి. హిమబిందు 470కి 461, రెడ్డిసాయి దర్శన్ 470కి 461 సాధించారన్నారు. అలాగే బైపీసీలో ఎస్ నజియా 440కి 426, ఎస్ షాహీనా 440కి 423 మార్కులు సాధించారు. ఎంఈసీలో కేఎస్ లక్ష్మీనరసింహా 500కి 488, జి ఆమని 500కి485, సీఈసీలో ఎస్ వైష్ణవి 500కి 490 మార్కులు సాధించి కళాశాల ప్రధమ స్థాయిలో నిలిచిందని గురుప్రసాద్ పేర్కొన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సి. వాణి 1000కి 987 సాధించి కళాశాల టాపర్‌గా నిలువగా ఎం. కవిత 1000కి 968 మార్కులు సాధించి ద్వితీయస్థానం సాధించారన్నారు. బైపీసీలో బి. మేఘన 1000కి 973, కె. అఫ్రా ఖానమ్ 1000కి 973 మార్కులు, ఎంఈసీలో ఆర్. రమ్యప్రియా 1000కి 887, సీఈసీలో ఎంఎస్ హిఫ్రా సాదియా 1000కి 939, ఎస్ఎండీ సుహేల్ 1000కి 931 మార్కులు సాధించారు. వారిని కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

పీలేరు, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఆదివారం తలపులలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేవలం నెల రోజుల వ్యవధిలో ముగిసిపోయే ఎన్నికల కోసం గ్రామాల్లో వ్యక్తిగత కక్షలు పెట్టుకోరాదని సూచించారు. ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 14: స్థానిక నీరుగట్టువారిపల్లెలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. చేనేత కార్మిక సంఘం ఏపీ వారి ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉమాదేవి మెటర్నటీ అండ్ జనరల్ హాస్పిటల్ మదనపల్లె వారిచే డాక్టర్ సి రమాదేవి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఆర్‌వీ దినేష్‌కుమార్‌లు ఉచిత వైద్యశిబిరంలో 200మంది చేనేత కార్మిక కుటుంబసభ్యులకు ఆరోగ్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేశారు. చేనేత కార్మిక యూనియన్ ఏపీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జింకా వెంకరమణ, రాష్ట్ర కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, సత్యసాయిజిల్లా ఉపాధ్యక్షు డు మధుసూదన, తంబళ్లపల్లె అధ్యక్షుడు ఈశ్వరయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటరత్నం, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పీలేరులో షర్మిల 'న్యాయ యాత్ర'

పీలేరు, ఏప్రిల్ 14: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన 'న్యాయ యాత్ర'లో భాగంగా 16న పీలేరులో పర్యటించనున్నారని పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బాలిరెడ్డి సోమశేఖరరెడ్డి తెలిపారు. పీలేరులో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆమె ప్రజలనుద్దేశ్యించి ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

గుర్రంకొండలో:కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన న్యాయ యాత్రను విజయవంతం చేయాలని గుర్రంకొండ పార్టీ అధ్యక్షుడు సమీరుద్దీన్ తెలిపారు. ఈనెల 16 పీలేరులో న్యాయ యాత్ర ప్రారంభమై కలికిరి, వాల్మీకిపురం మీదుగా మదనపల్లెకు చేరుకొంటారని తెలిపారు. కావున మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 14: వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా వుండాలని టు టౌన్ సీఐ యువరాజు పేర్కొన్నారు. ఆదివారం అగ్నిమాపకశాఖ స్టేషన్‌లో ఫైర్ ఆఫీసర్ శివప్ప ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్స వాలను ప్రారంభించారు. అగ్నిప్రమాదలు జరిగితే సహాయం కోసం 101 లేదా 08571 222101 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఇది మరో కోడికత్తి డ్రామానే..

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 14: విజయవాడలో సీఎం జగన్‌పై జరిగిన రాళ్లదాడి మరో కోడికత్తి డ్రామానే అని మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ పై జరిగిన రాళ్ల దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రత్యేక రక్షణ దళం తప్పించుకుని ఆయనపై రాళ్లదాడి జరగడం జిమ్మిక్కేమో అని అభిప్రాయపడ్డారు.

నాడు కోడి కత్తి, బాబాయి గొడ్డలి..నేడు రాయి దాడి

- గజమాల తగిలి గాయమైతే టీడీపీ వారు రాయి విసిరినట్లు ప్రచారం
- జగన్నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు
- దాడుల సంస్కృతి టీడీపీది కాదు, వైసీపీదే
- కేవీపల్లె ప్రచారంలో కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఏప్రిల్ 14: గత ఎన్నికల సందర్భంగా విశాఖ కోడి కత్తి, పులివెందుల బాబాయి గొడ్డలిపోటును ప్రచార అస్త్రంగా వాడుకున్న సీఎం వైఎస్ జగన్ ప్రస్తుత ఎన్నికల్లో విజయవాడలో రాయి సంఘటనను రాజకీయ లబ్ధి పొందడానికి యత్నిస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. విజయవాడలో ముఖ్యమంత్రిపై టీడీపీ శ్రేణులు దాడి చేశారన్న ఆరోపణలపై ఆదివారం ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దాడుల సంస్కృతి టీడీపీది కాదని, వైసీపీదేనన్నారు. అందుకు గత ఎన్నికల నుంచి నిన్నటి విజయవాడ రాయి ఉదంతం వరకు జరిగిన సంఘ టనలే సజీవ సాక్ష్యాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా విశాఖ ఎయిర్ పోర్టులో కోడి కత్తి, సొంతింట్లోనే సొంత బాబాయిని మట్టుపెట్టి గుండెపోటు అని ఒకసారి, టీడీపీ నాయకులు హత్య చేశారని మరోసారి డ్రామాలాడిన సంగతి ప్రజలు ఇంకా మరిచిపోలేదని కిశోర్ తెలిపారు. ఆయన అభిమానులు గజమాల వేస్తున్న సమయంలో ఆ గజమాలకు ఉన్న కట్టె విరిగి గాయమైనట్లు స్పష్టంగా వీడియోల్లో కనపడుతున్నా, టీడీపీ నాయకులు దాడి చేశారని జగన్ మరోమారు సానుభూమి డ్రామాలు ఆడుతున్నారని తెలిపారు. కోడి కత్తి విషయంలోనూ, వివేకానంద రెడ్డి హత్యలోనూ వైసీపీ నాయకులు ప్రమేయం తేటతెల్లం కావడం, సొంత చెల్లెళ్లు షర్మిళ, సునీత సూటిగా ప్రశ్నలు సంధిస్తుండడంతో ప్రజల్లో వైసీపీ గ్రాఫ్ నానాటికీ దిగజారిపోతోందన్నారు. దీంతో తన ప్రతిష్టను కాపాడుకోవడమే కాకుండా ఆ అంశాలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు విజయవాడ రాయి సంఘటనను వాడుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన జరగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై తమకు అనుమానాలున్నాయని ఆయన తెలిపారు. ఎన్నికల దృష్ట్యా వైసీపీ నాయకులు భవిష్యత్తులో ఇటువంటి నాటకాలు మరిన్ని ఆడతారని, ఎవరి ప్రాణాలు తీసేందుకైనా వెనుకాడరని కిశోర్ ఆందోళన వ్యక్తం చేశారు.



కేవీపల్లె మండలంలో ప్రచారం చేస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

ఒక్కసారి గెలిపించండి...అభివృద్ధి చేసి చూపిస్తా..!

పీలేరు, ఏప్రిల్ 14:ఎన్నికల్లో తనను ఒక్కసారి గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేవీపల్లె మండలం నూతనకాల్వ పంచాయతీలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఆదివారం ఆయన గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి కోసం ఇబ్బందిపడుతున్న కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాల ప్రజలకు శాశ్వతంగా ఆ సమస్య నుంచి విముక్తి కల్పించాలన్న లక్ష్యంతో తాము కేవీపల్లె మండలం గువ్వలగుడ్డం వద్ద రూ.100 కోట్లతో ఝరికోన ప్రాజెక్టు నిర్మించామన్నారు. పైపులైన్ల ద్వారా ఆ మూడు మండలాల్లోని కుగ్రామాలకు సైతం సురక్షిత తాగునీరు అందించే ఆ పథకాన్ని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తన అన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప గడిచిన ఐదేళ్లుగా అభివృద్ధి మచ్చుకు కూడా కనిపించడం లేదన్నారు. విజ్ఞతతో ఆలోచించి ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, రాజంపేట ఎంపీ అభ్యర్థిగా తన అన్న కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మాపురం రఘున్న, గీతాంజలి, ఉదయశ్రీ, గాలి సుధాకర్ నాయుడు, కుప్పం రవిచంద్రారెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, రాజశేఖర్ నాయుడు, వెంకటేశ్వర చౌదరి, శివప్రసాద్ రెడ్డి, రహంతుల్లా, సీవీ రావు, కండక్టర్ రమణ, గోరంట్లపల్లె కృష్ణయ్య, వేణుగోపాల్ రెడ్డి, ద్వారకనాథ నాయుడు, ధనంజయ పాల్గొన్నారు.